
ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపర్ పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
కర్నూలు, డోన్, ఆత్మకూరు, కల్లూరు - 99854 09260
కర్నూలు, కోడుమూరు, నందికొట్కూరు - 9985411379
ఆదోని, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు - 9985171793
నంద్యాల, పాణ్యం, ఆళ్ళగడ్డ, బనగానపల్లె - 9985411377

ఎందుకీ నిర్లక్ష్యం..!

రాయలసీమ జిల్లాల్లో కరువు.. వలసలు శాశ్వతంగా నివారించే లక్ష్యంగా చేపట్టే ఏ ప్రాజెక్టు అయినా రైతులకు వరమే! ఏ ప్రభుత్వం చేపట్టినా వారు స్వాగతిస్తారు. అయితే ప్రాజెక్టులను పూర్తి చేయాలన్న చిత్తశుద్ధి పాలకులకు ఉండాలి. జగన్ ప్రభుత్వంలో అది ఏమాత్రం కనిపించడం లేదని స్పష్టంగా తెలుస్తోంది. జగన్ హడావుడిగా, ఆర్భాటంగా శంకుస్థాపనలు చేయడం తప్ప అవసరమైన మేరకు అనుమతులు, నిధులు లేకపోవడం ఆ ప్రాజెక్టుల పాలిట శాపంగా మారింది. రాయలసీమ దుర్భిక్ష నివారణ మిషన్ (ఆర్‌డీఎంపీ)లో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో చేపట్టిన ప్రాజెక్టులకు రూ.1,360 కోట్ల బిల్లులు చెల్లించకపోవడం వల్ల ఈ పనులు చేయలేమంటూ కాంట్రాక్టర్లు ఆపేశారు. ప్రధాని మోదీని సీఎం జగన్ గట్టిగా అడగలేని పరిస్థితి వల్ల పీఎం కృషి సంచాయి యోజన (పీఎంకేఎస్‌వై) గ్రాంట్ అందని ద్రాక్షగా మారిందనే విమర్శ ఉంది.


హెడ్ వర్క్ పనుల వద్దే ఆగిపోయిన ఆర్డీఎస్ కుడి కాలువ


వేదవతి ప్రాజెక్టు కోసం తెచ్చిన పైపులు ఇలా పొలాల్లోనే

- జగన్ నిర్వాకంతో పడకేసిన సాగునీటి ప్రాజెక్టులు
- నాడు రాయలసీమ దుర్భిక్ష నివారణ మిషన్ పేరిట హడావుడి
- చేసిన పనుల్లో రూ.1,393 కోట్ల బిల్లులు పెండింగ్..
- పనులు ఆపేసిన కాంట్రాక్టర్లు
- పీఎం కృషి సంచాయి గ్రాంట్ ఇవ్వలేమన్న కేంద్రం
- నాడు ఆర్భాటం.. నేడు నిస్తేజం

కర్నూలు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ దుర్భిక్ష నివారణ మిషన్ (ఆర్‌డీఎంపీ) కింద జగన్ ప్రభుత్వం మూడేళ్ల కింద ఆర్భాటంగా ఉమ్మడి కర్నూలు, అనంతపురం, కడప జిల్లాల్లో 23 ప్రాజెక్టులు రూ.33,862 కోట్లతో చేపట్టింది. నిధులు కేటాయింపులు లేకుండానే హడావుడిగా శంకుస్థాపనలు చేశారు. ఏదో సాధించాలనుకుని రంగలోకి దిగిన ప్రభుత్వం నిధుల లేమితో.. చివరికి ఏమీ చేయలేకపోతుంది. ప్రభుత్వం వద్ద నిధులు లేవు. అప్పులు పుట్టక.. ఆదుకుంటుందని ఆశించిన కేంద్ర ప్రభుత్వం కూడా చేతులెత్తేయడంతో ఈ ప్రాజెక్టులు పూర్తి అయ్యేదెన్నడో..? అనే ప్రశ్నలు వెల్లువెత్తున్నాయి. రాయలసీమ జిల్లాల్లో కృష్ణా, తుంగభద్ర, పెన్నా వంటి నదులు ప్రవహిస్తున్నా.. కరువు రైతుల కన్నీళ్లు తుడిచేలా వరద జలాలు సద్వినియోగం చేసుకోలేని దుస్థితి ఉంది. 15-20 ఏళ్లుగా శ్రీశైలం జలాశయానికి వరద లెక్కలను పరిశీలిస్తే ఏటేటా వరద రోజులు (ఫ్లడ్ డేస్) తగ్గిపోతున్నాయి. ఈ క్రమంలో తక్కువ సమయంలో ఎక్కువ వరద జలాలు వినియోగించుకోవాలని జగన్ ప్రభుత్వం ఆలోచన చేసింది. అయితే ఎన్నో తరాలకు ఉపయోగపడే ప్రాజెక్టుల రూపకల్పనలో తొందరపాటు, నిధులు కేటాయింపులు లేకుండా ఆర్భాటంగా శంకుస్థాపనలు చేయడం.. నిధులు లేమి.. పాలకుల నిర్లక్ష్యం.. ఎంపీలు, ఎమ్మెల్యేలు పట్టించుకోకపోవడం సీమ ప్రాజెక్టులకు శాపంగా మారింది. రాయలసీమ దుర్భిక్ష నివారణలో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో రూ.9,725 కోట్ల అంచనాతో రాయలసీమ లిఫ్ట్, పోతిరెడ్డిపాడు నుంచి గోరుకల్లు రిజర్వాయర్ వరకు ఎస్ఆర్ఎంసీ సహా జీఎన్ఎస్ఎస్ కెనాల్ సీసీ లైనింగ్, గోరుకల్లు జలాశయం నుంచి అవుకు జలాశయం వరకు జీఎన్ఎస్ఎస్ ఫ్లడ్‌ఫ్లో కెనాల్ సీసీ లైనింగ్, అవుకు మూడవ అదనపు టన్నెల్ తవ్వకం, కుందూ నది విస్తరణ పనులు చేపట్టారు. 2020-21లో ఆర్భాటంగా చేపట్టారు. కాంట్రాక్ట్ గడువు 30 నెలలు. ప్రారంభంలో వేగంగా పనులు చేశారు. దాదాపుగా రూ.2,300 కోట్లు చేస్తే సుమారుగా రూ.1,360 కోట్లకు పైగా బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో కాంట్రాక్టర్లు పనులు ఆపేశారు.

అడగని జగన్.. ఇవ్వని మోదీ!


పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్

నీతి అయోగ్ సభ్యుడు అవినాశ్ మిశ్రా సూచన మేరకు రాయలసీమ దుర్భిక్ష నివారణ మిషన్ కింద చేపట్టిన 23 ప్రాజెక్టుల్లో 11 ప్రాజెక్టులకు ప్రధానమంత్రి కృషి సంచాయి యోజన (పీఎంకేఎస్‌వై) గ్రాంట్ కోసం దరఖాస్తు చేశారు. దీని కింద ఎంపికైతే 70 శాతం కేంద్ర ప్రభుత్వం గ్రాంట్ రూపంలో ఇస్తుంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి బీసీఆర్ వరకు ప్రధాన కాలువ లైనింగ్‌కు రూ.570.45 కోట్లు, బానకచర్ల నుంచి గోరుకల్లు రిజర్వాయర్ వరకు జీఎన్ఎస్ఎస్ కెనాల్ సీసీ లైనింగ్‌కు రూ.939.65 కోట్లు, గాలేరు-నగరి కెనాల్ 0-56 కి.మీల వరకు ఇంప్రూవ్‌మెంట్ రూ.305.70 కోట్లు, గోరుకల్లు రిజర్వాయర్ నుంచి అవుకు రిజర్వాయర్ వరకు జీఎన్ఎస్ఎస్ లైనింగ్‌కు రూ.1,457 కోట్లు, అవుకు రిజర్వాయర్ - గండికోట రిజర్వాయర్ వరకు జీఎన్ఎస్ఎస్ కెనాల్ ఇంప్రూవ్‌మెంట్ రూ.633 కోట్లు, కడప జిల్లా సీఎం జగన్ సొంత నియోజకవర్గం పులివెందులలో పీబీసీ, సీబీఆర్ రైట్ కెనాల్, జీఎల్ఐ మైక్రో ఇరిగేషన్ రూ.1,233 కోట్లు, యురేనియం బాధిత గ్రామాలకు తాగునీరు అందించే సీబీఆర్ - ఎర్రబల్లి లిఫ్ట్‌కు రూ.1,113 కోట్లు, గండికోట నుంచి చిత్రావతి, పైడిపాలెం ఎత్తిపోతల పథకాల అప్‌గ్రేడ్ రూ.3,674 కోట్లు, జీఎన్ఎస్ఎస్ - హంద్రీనీవా ఎత్తిపోతల పథకం రూ.5,030 కోట్లు, నెల్లూరు జిల్లాలో సోమశిల, కండలేరు ఫ్లడ్‌ఫ్లో కెనాల్స్ ఇంప్రూవ్‌మెంట్స్ రూ.951 కోట్లు, జీకేఎన్ కెనాల్ (సోమశిల - రాళ్లపాడు రిజర్వాయర్)కు రూ.655 కోట్లు కలిపి రూ.16,568 కోట్లు పీఎంకేఎస్‌వై గ్రాంట్ ఇవ్వాలని ప్రతిపాదించారు. ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, జలవనరుల శాఖ ఇంజనీర్లు పలుమార్లు ఢిల్లీకి వెళ్లి గ్రాంట్ కోసం ప్రయత్నాలు చేశారు. సీఎం జగన్ గట్టిగా అడగకపోవడం, ప్రధాని మోదీ కనికరించకపోవడంతో గ్రాంట్ అందని ద్రాక్షగా మారింది.


ఆగిన రాయలసీమ లిఫ్ట్ పనులు

పడకేసిన వేదవతి, ఆర్డీఎస్

కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతం ఆలూరు, ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో కరువు, వలసల నివారణే లక్ష్యంగా టీడీపీ ప్రభుత్వంలో నాటి సీఎం చంద్రబాబు ఆర్డీఎస్ కుడి కాలువ, వేదవతి ప్రాజెక్టులు చేపట్టారు. జగన్ ప్రభుత్వ నిర్లక్ష్యం శాపంగా మారింది. రూ.1,981 కోట్లతో ఆర్డీఎస్ కుడి కాలువ ఆర్డీఎస్ కుడి కాలువ పనులు ఎస్‌సీసీ సంస్థ దక్కించుకుని హెడ్ రెగ్యులేటర్, ఒక కిలోమీటరు ప్రధాన కాలువ పనులకు రూ.12 కోట్లు ఖర్చు చేస్తే జగన్ ప్రభుత్వం ఒక్క పైసా బిల్లులు చెల్లించలేదు. రూ.1,942 కోట్లతో చేపట్టిన వేదవతి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులు మెగా ఇంజనీరింగ్ సంస్థ చేపట్టింది. రూ.104 కోట్ల పనులు చేస్తే రూ.83 కోట్లు బిల్లులు చెల్లించారు. రూ.21 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. నిధులలేమితో రెండున్నరేళ్లుగా ఈ ప్రాజెక్టులు అటకెక్కాయి.

మిషన్ ముందుకు వెళ్లేదెలా..?

- శ్రీశైలం ఎగువన సంగమేశ్వరం నుంచి 854 అడుగులు దిగువన 35 వేల క్యూసెక్కులు ఎత్తిపోసుకోవడానికి వీలుగా రాయలసీమ లిఫ్ట్ చేపట్టారు. అంచనా రూ.3,825 కోట్లు కాగా.. కాంట్రాక్ట్ విలువ (ఈపీసీ) రూ.3,307 కోట్లకు టెండర్లు పిలిస్తే.. మెగా సంస్థ, ఎస్పీఎంఎల్ సంస్థ జాయింట్ వెంచర్‌గా పనులు దక్కించుకున్నారు. 30 నెలల్లో పనులు పూర్తి చేసేలా 2020లో ఒప్పందం చేసుకున్నారు. 12 పంపుల ద్వారా ఎత్తిపోసి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ దిగువన ఎస్ఆర్ఎంసీ కాలువకు వరద జలాలు తరలించాలన్నది లక్ష్యం. ముందు చూపు, ప్రణాళిక లేకుండా ఆర్భాటంగా చేపట్టడంతో పర్యావరణ అనుమతులు (ఈసీ) లేవని గ్రీన్ ట్రిబ్యునల్‌లో తెలంగాణ ఫిర్యాదు చేయడం వల్ల పనులు ఆగిపోయాయి. అప్పటికే రూ.740 కోట్లు పనులు చేశారు. అయితే.. తాగునీటి కోసం గత ఆగస్టు నుంచి 6 పంపుల పనులు చేపట్టి సుమారుగా రూ.50 కోట్ల విలువైన పనులు చేశారు.
- పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ వరకు శ్రీశైలం కుడి ప్రధాన కాలువ (ఎస్ఆర్ఎంసీ), బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి గోరుకల్లు రిజర్వాయర్ వరకు 50 కిలో మీటర్లు గాలేరు-నగరి వరద కాలువ (జీఎన్ఎస్ఎస్ ఫ్లడ్‌ఫ్లో కెనాల్) సామర్థ్యం రెట్టింపు చేస్తూ సీసీ లైనింగ్ అంచనా రూ.1,500 కోట్లు కాగా.. ఈసీవీ రూ.1,061.69 కోట్లతో 2020 ఆగస్టు 28న టెండర్లు పిలిస్తే.. ఆగ్రాకు చెందిన పీఎస్‌సీ ఇన్‌ఫ్రా లిమిటెడ్ సంస్థ పనులు దక్కించుకొని 2021 మార్చి నెలలో 36 నెలల్లో పూర్తి చేసేలా ఒప్పందం చేసుకుంది. రూ.350 కోట్లు ఖర్చు చేస్తే.. ఒక్క పైసా కూడా బిల్లులు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టరు పనులు ఆపేశారు.
- గోరుకల్లు రిజర్వాయర్ నుంచి అవుకు రిజర్వాయర్ వరకు 60 కిలోమీటర్లు జీఎన్ఎస్ఎస్ ఫ్లడ్‌ఫ్లో కెనాల్ సీసీ లైనింగ్, 10 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో 6 కిలోమీటర్లు పొడవు అవుకు మూడో అదనపు టన్నెల్ పనులు రూ.1,500 కోట్లు అంచనాతో చేపట్టారు. ఈసీవీ విలువ రూ.1,269.49 కోట్లకు 2020 సెప్టెంబరు ఒకటో తేదీన టెండర్లు పిలిచారు. డీఎస్ఆర్-వీఏఆర్‌కేఎస్ సంస్థలు జాయింట్ వెంచర్‌గా పనులు దక్కికున్నాయి. రూ.900 కోట్లు విలువైన పనులు చేస్తే ప్రభుత్వం రూ.200 కోట్లు బిల్లులు చెల్లించింది. రూ.700 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో పనులు ఆగిపోయాయి.
- నిప్పలవాగు, కుందూ నదులు 30 వేల క్యూసెక్కుల ప్రవాహానికి వీలుగా విస్తరణ, 2.9 టీఎంసీల సామర్థ్యంతో రాజోలి జలాశయం, 0.80 టీఎంసీల సామర్థ్యంతో జొలదరాశి జలాశయాల పనులు ఒకే ప్యాకేజీగా అంచనా విలువ రూ.2,900 కోట్లు కాగా.. ఈసీవీ విలువ రూ.1,769.65 కోట్లకు 2020 నవంబరు 11న టెండర్లు పిలవగా ఎంఆర్‌కేఆర్ కన్‌స్ట్రక్షన్ అండ్ ఇండస్ట్రీస్ (అన్నమయ్య జిల్లా రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి కుటుంబానికి చెందిన సంస్థ) పనులు దక్కించుకుంది. కుందూ నది విస్తరణ పనులు ఒక్కటే రూ.310 కోట్ల పనులు చేస్తే ఒక్క పైసా బిల్లు రాలేదని పనులు ఆపేశారు. రాజోలి, జొలదరాశి జలాశయాల పనులకు ఒక్క ఇటుక కూడా వేయలేదు. ఈ పనులకు 2019 డిసెంబరు 25న సీఎం జగన్ శంకుస్థాపన చేశారు.

ఎన్నికల ప్రచారానికి రెండు హెలికాప్టర్లా?

మాజీ ఎమ్మెల్యే బీసీ



బనగానపల్లె, ఫిబ్రవరి 23: సీఎం జగన్ భద్రత కోసం అని చెబుతున్న రెండు హెలికాప్టర్లు ఎన్నికల ప్రచారం కోసమే అని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ ప్రజాధనం వెచ్చించిన రెండు హెలికాప్టర్లు సీఎం జగన్ భద్రత కోసం కాదని, ఎన్నికల ప్రచారానికి వాడుతున్నారని అన్నారు. ఈ ఎన్నికలు పేదలు వర్సెస్ పెత్తందారుల మధ్య అని అంటూ నిత్యం అబద్ధాలు ఆడుతున్న సీఎం ప్రజాధనం వెచ్చించి హెలికాప్టర్లను ఎన్నికల సభల పర్యటనకు వాడుతున్నారని అన్నారు. ఓవైపు రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయి కొట్టుమిట్టాడుతోంటే సీఎం జగన్ తన స్వప్రయోజనాల కోసం ప్రభుత్వ ధనాన్ని మంచినీళ్లలా ఖర్చు పెడుతున్నారని విమర్శించారు. సీఎం హోదాలో జగన్‌కు ఒక హెలికాప్టర్ ఉందని, రానున్న ఎన్నికల్లో ప్రచారం చేసుకునేందుకు భద్రతను సాకుగా చూపి ప్రజాధనంతో మరో హెలికాప్టర్‌ను లీజుకు తీసుకోవడం దారుణమన్నారు. జగన్‌కు సంఘ విద్రోహ శక్తుల నుంచి ముప్పు ఉందని సాకులు చెబుతున్నారన్నారు. అసలు విషయం ఏమంటే సీఎం జగన్‌ను మించిన సంఘ విద్రోహ శక్తులు ఈ రాష్ట్రంలో లేవని అన్నారు. రాష్ట్ర ప్రజలకు సరైన రోడ్లు లేక నిత్యం ఇబ్బందులు పడుతుంటే పెత్తందారు జగన్ 20 కిలోమీటర్లకు కూడా హెలికాప్టర్ వాడటం ఘోరమన్నారు. సీఎం జగన్ వాడే ఒక్క హెలికాప్టర్‌కు నెలకు రూ.1.92 కోట్లు లీజు చెల్లించాలని, మూడు నెలలకు అక్షరాలా హెలికాప్టర్లకే రూ.11.5 కోట్లు చెల్లించాలని అన్నారు. ప్రజల సొమ్మును నీళ్లలా ఖర్చు చేస్తూ మళ్లీ ప్రచారంలో మాత్రం పేదల పక్షం నాది అంటూ సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. మూడు నెలల్లో గద్దెదిగే జల్సారాయుడికి ఇవన్నీ అవసరమా అని బీసీ ప్రశ్నించారు.

రహదారి ప్రమాదాల నియంత్రణకు చర్యలు

కలెక్టర్ కె.శ్రీనివాసులు


సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, ఆర్డీవో

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 23: జిల్లాలో రహదారి ప్రమాదాలను నివారించేందుకు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో జిల్లా స్థాయి రహదారి భద్రతా కమిటీ సమీక్షా సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డి, ఆర్డీవో జి.వి శివారెడ్డి, డీఎస్పీలు, మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, సంబంధిత అధికారులు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు మాట్లాడుతూ నంద్యాల జిల్లా పరిధిలోని శాంతిరాం మెడికల్ కళాశాల, చాబోలు క్రాస్, అయ్యలూరు మెట్ట, ఆళ్లగడ్డలోని అహోబిలం క్రాస్, ఏపీ గోడౌన్స్, బలపనూరు క్రాస్ తదితర జాతీయ రహదారుల్లో రహదారి ప్రమాదాల నియంత్రణకు గుర్తించిన బ్లాక్ స్పాట్లలో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని అన్నారు. పనుల్లో నిర్లక్ష్యం వహించిన ఎన్‌హెచ్ అధికారులపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ వారం రోజులలో పూర్తి చేసి సంబంధిత నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. వైజంక్షన్ నుంచి ఐటీసీ వరకు లైటింగ్ లేని కారణంగా రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని, మూడు రోజుల్లో లైటింగ్ ఏర్పాటు చేసి ఫొటోలు పంపాలని అన్నారు. ఎస్పీ రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో ఎంట్రీ, ఎగ్జిట్, గుర్తింపు సూచికల ఏర్పాటు చేయాలని ఆర్ అండ్‌బీ అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారుల్లో ప్రమాదాల నియంత్రణకు సూచించిన భద్రతా చర్యలు చేపట్ట లేదని ఎన్‌హెచ్ అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

నల్లమలలో మంటలు

- రెండు కలప డిపోల్లో వెదురు సేకరణ నిలిపివేత


నల్లమల అడవిలో చెలరేగిన మంటలు

రుద్రవరం, ఫిబ్రవరి 23 : రుద్రవరం చెలిమ రేంజ్‌లోని నల్లమలలో మంటలు చెలరేగాయి. అగ్ని ప్రమాదంలో మొక్కలు, గడ్డి వృక్షాలు రాలిపోయాయి. శుక్రవారం మంటలను అదుపు చేయడంలో ఫారెస్టు అధికారులు నిమగ్నమయ్యారు. అన్ని ప్రాంతాల్లో మంటలు అదుపు చేయడానికి ఫారెస్టు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. మంటలు చెలరేగుతున్న ప్రాంతానికి వెళ్లి అదుపు చేస్తున్నారు.

వేసవి కావడంతో నల్లమలలో మంటలు చెలరేగాయి. అడవి అంతా కాలిపోతున్నదని రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ చిరంజీవి చౌదరి ఆదేశాలతో కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఫీల్డ్ డైరెక్టర్ డీఎన్ఎన్ మూర్తి అడవిలో వెదురు సేకరణ నిలిపివేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు రుద్రవరం కలప డిపో చెలిమ రేంజ్ గాజులపల్లె డిపో పరిధిలో సేకరిస్తున్న వెదురు సేకరణ నిలిచిపోయింది. అడవిలో ప్రవేశించిన కొందరు వ్యక్తులు ధూమపానం చేయడం వల్ల మంటలు చెలరేగాయని ఉన్నతాధికారులు నిర్ధారణకు వచ్చారు. రెండు డిపోలకు ఫారెస్టు ఉన్నతాధికారుల ఆదేశాలు అందాయి. ఈ మేరకు వెదురు సేకరణ నిలిపివేశారు. మంటలు చెలరేగడంతో వన్యప్రాణులు మరణిస్తాయని, ఔషధ మొక్కలు కాలిపోతాయని అన్నారు. సుమారు 11 అగ్నిప్రమాద పాయింట్లను ఉన్నతాధికారులు గుర్తించారు.

హఠకేశ్వరాలయాన్ని సందర్శించిన కంచి కామకోటి పీఠాధిపతి


హఠకేశ్వరాలయంలో కంచి కామకోటి పీఠాధిపతి

శ్రీశైలం, ఫిబ్రవరి 23: శ్రీశైల దేవస్థానం పరిధిలోని హఠకేశ్వరం, పాలధార పంచధార వద్ద ఉన్న శారదా చంద్రమౌళీశ్వర ఆలయాన్ని కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి సందర్శించారు. ఆ సందర్భంగా స్వామీజి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠాధిపతి వెంట ఆలయ ఈఓ డి.పెద్దిరాజు, ఏఈఓ హరిదాసు తదితరులు ఉన్నారు.

6 నుంచి మహానందీశ్వరుడి బ్రహ్మోత్సవాలు


ఆహ్వాన పత్రికలు విడుదల చేస్తున్న ఈఓ

మహానంది, ఫిబ్రవరి 23: మహానందిలో మార్చి 6 నుంచి 11 వరకు మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో ఉత్సవమూర్తుల విగ్రహాల ఎదుట ఆహ్వాన పత్రికలు ఉంచి వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మార్చి 6 నుంచి 11వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని ఈఓ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ ఎర్రమల మధు, పర్యవేక్షకులు వెంకటేశ్వర్లు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రంగన్న, నాగభూషణం, నిత్యాన్న సత్రం కూరగాయల దాత లక్కబోయిన ప్రసాద్ పాల్గొన్నారు.

కావలెను
జననీ మాక్స్ లిమిటెడ్., నందు ఆర్గనైజర్స్‌గా పనిచేయుటకు మహిళా మరియు పురుషులు కావలెను.
అర్హత : ఇంటర్, నంద్యాల,ఆళ్లగడ్డ మరియు బనగానపల్లె బ్రాంచీల యందు ఖాళీలు కలవు.
వివరములకు :
08514 - 222115, 93468 03212.

మార్కెట్ కమిటీ అవినీతిమయం..?

- అందినకాడికి దండుకుంటున్న అధికారులు
- దళారులు, అధికారుల కుమ్మక్కుతో నష్టపోతున్న రైతులు


ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 23: వేరుశనగ పంట ఉత్పత్తుల క్రయ విక్రయాలకు పెట్టింది పేరు ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ. ఉమ్మడి కర్నూలు జిల్లాతో పాటు పక్కనున్న తెలంగాణ, కర్ణాటక ప్రాంతాల వేరుశనగ రైతులు అమ్మకాలు చేసుకునేందుకు ఈ మార్కెట్‌కే పంటను తరలిస్తుంటారు. అలాంటి పేరున్న మార్కెట్‌లో మునుపెన్నడూ లేని విధంగా రోజురోజుకూ అవినీతి పెచ్చుమీరిపోతోంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తున్నది. చిన్నపాటి ట్రేడ్ లైసెన్స్‌లతో పాటు ఇతర అనుమతుల కోసం వేల రూపాయలు అధికారులు దండుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేగాక వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో ఉన్న పండ్లు, కూరగాయల మార్కెట్‌లో సైతం అవినీతి, అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. ఇందుకు ఉదాహరణే.. గురువారం ఏసీబీ అధికారుల దాడులు. ట్రేడ్ లైసెన్స్ కోసం వేల రూపాయలు డిమాండ్ చేసి ఓ మహిళా అధికారి పట్టుబడడం కలకలం రేపుతోంది.

లైసెన్స్ రెన్యువల్, మంజూరులో చేతివాటం ప్రదర్శిస్తున్న అధికారులు

వ్యవసాయ మార్కెట్ కమిటీలో దాదాపు 84 కమిషన్ ఏజెంట్ల దుకాణాలు ఉండగా దాదాపు 64 దుకాణాల్లో పెద్ద ఎత్తున పంట ఉత్పత్తుల క్రయ, విక్రయాలు నిత్యం జరుగుతుంటాయి. అలాగే మార్కెట్ పరిధిలో ఉన్న పండ్లు, కూరగాయల హోల్‌సెల్ మార్కెట్‌లో సైతం దాదాపు 42 దుకాణాలు ఉన్నాయి. మార్కెట్‌కు సాలీనా సెస్ రూపంలో దాదాపు రూ.5 కోట్ల వరకు ఆదాయం సమకూరుతోంది. కమిషన్ ఏజెంట్ల దుకాణాల లైసెన్స్‌లు రెన్యువల్ చేసే సమయంలో అధికారులు తమదైన శైలిలో చేతివాటం ప్రదర్శిస్తూ వ్యాపారుల నుండి అందిన కాడికి దండుకుంటున్నారే ఆరోపణలు ఉన్నాయి. గతంలో స్థానికంగా పని చేసిన ఓ ప్రధాన అధికారి ఏకంగా బేరాలు పెట్టి దుకాణానికి ఇంత అని వసూలు చేసిన సందర్భాలు లేకపోలేదు. అంతేగాక సదరు అధికారి మార్కెట్‌లోనే కమిషన్ ఏజెంట్ దుకాణం, కూరగాయల మార్కెట్‌లో ఒక దుకాణాన్ని బినామి పేర్లపై న డిపేవాడని వ్యాపారులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. సదరు వ్యాపారి బాటలోనే ప్రస్తుత అధికారులు కూడా ముందుకు సాగుతుండడం గమనార్హం. దుకాణాల లైసెన్స్ రెన్యువల్స్‌లో అవినీతికి తెరలేపిన అధికారగణం అంతటితో ఆగక ఒక అడుగు ముందుకేసి మార్కెట్‌లో పనిచేస్తున్న హమాలీల లైసెన్స్‌ల రెన్యువల్స్, ఎవరైనా చనిపోయిన వారి స్థానంలో కొత్తవారిని తీసుకునేందుకు ఇచ్చే లైసెన్స్‌ల్లో హమాలీల నుంచి కూడా కొంత మొత్తాన్ని డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. చేయి తడపనిదే లైసెన్స్‌లు ఇవ్వమనే ధోరణిలో ఉన్నట్లు ఇక్కడి అధికారుల తీరు మారింది. అంతేగాక కూరగాయల హోల్‌సెల్ దుకాణాల లైసెన్స్‌ల మంజూరులో కూడా మార్కెట్ చలానా కాదని మూడింతలు వసూలు చేస్తుండడంతోనే విసుగుచెందిన వ్యాపారులు ఏసీబీ అధికారులను ఆశ్రయిస్తున్నారు. దాని ఫలితమే గురువారం మార్కెట్‌లో జరిగిన ఏసీబీ అధికారులు దాడులు అని చెప్పవచ్చు. ఏసీబీ అధికారులకు వ్యాపారి నుంచి లంచం తీసుకుంటూ ఓ అధికారి పట్టుబడడం మార్కెట్‌లో తీవ్ర కలకలం రేపింది.

వ్యాపారుల కుమ్మక్కు

వ్యవసాయ మార్కెట్ కమిటీలో పంట ఉత్పత్తుల విక్రయాల్లో కొనుగోలుదారులు కుమ్మక్కై. ఇటు మార్కెట్‌కు, అటు రైతులకు నష్టాన్ని చేకూరుస్తున్నారు. వ్యాపారులంతా కుమ్మక్కై. ఆరోజు మార్కెట్‌కు వచ్చిన పంట ఉత్పత్తులకు ఏ ధర నిర్ణయించాలో ముందుగానే మాట్లాడుకొని ఆ ధరకు మించి టెండరు వేయడంలేదనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. వేరుశనగ ధరలను తక్కువ రాస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే మార్కెట్‌కు వెళ్లి పరిశీలించి వ్యాపారులతో సమావేశం నిర్వహించి ధరలు తగ్గకుండా చూడాలని అధికారులకు సూచించారు. అయినా వ్యాపారుల తీరులో ఎటువంటి మార్పు రాకపోవడం గమనార్హం. వ్యాపారులు ఇలా కుమ్మక్కై టెండర్లు వేస్తుండడంతో రైతులకు మద్దతు ధర అందడం లేదు. దిక్కుతోచని పరిస్థితుల్లో వచ్చిన కాడికి పంటలను అమ్ముకొని ఉసూరుమని అంటున్నారు.

రెట్టింపు కమిషన్ వసూలు

పంట ఉత్పత్తులు మార్కెట్‌కు తెచ్చి విక్రయించిన రైతుల నుంచి 2 శాతం కమిషన్‌ను వసూలు చేయాల్సి ఉంది. అయితే ఇక్కడి కమిషన్ ఏజెంట్లు మాత్రం అధికారుల సహకారంతో అందుకు విరుద్ధంగా రెట్టింపు కమిషన్‌లు వసూలు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. తక్ పట్టీలో వాస్తవ కమిషన్ వసూలు చేస్తున్నట్లుగా రాసి వెనుకభాగంలో రెట్టింపు కమిషన్, వివిధ ఖర్చుల పేరుతో అందినకాడికి దోచుకుంటున్నారు. ఈ విషయం స్థానిక మార్కెట్ అధికారులకు తెలిసినా ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. గతంలో రెట్టింపు కమిషన్ వసూలు, అధిక ఖర్చుల వసూళ్లపై కొంతమంది రైతులు ఫిర్యాదులు చేయడంతో వారికి గుట్టుచప్పుడు కాకుండ సర్ది చెప్పి అధికారులు పంపించిన సందర్భాలు ఉన్నాయి. అధికారుల సహకారంతోనే మార్కెట్‌లోని కమిషన్ ఏజెంట్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు, రైతు సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

మార్కెట్‌లో అవినీతికి చోటు లేకుండా చర్యలు

నేను ఇటీవలే మార్కెట్ కార్యదర్శిగా బాధ్యతలు తీసుకున్నాను. మార్కెట్ పరిధిలో ఎలాంటి అవినీతి, అక్రమాలు జరగకుండా చర్యలు తీసుకున్నా. కూరగాయల హోల్‌సెల్ మార్కెట్‌లో ఆరోపణలు రావడంతో సిబ్బందిని మార్చాను. ఇక దుకాణాల లైసెన్స్‌లు, హమాలీల లైసెన్స్‌ల రెన్యువల్స్, కొత్త లైసెన్స్‌ల జారీ విషయంలో అక్రమాలు జరుగుతున్నాయని నా దృష్టికి రాలేదు. దానిపై కూడా విచారించి చర్యలు తీసుకుంటా.

-పద్మావతి, కార్యదర్శి,
ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ


మార్కెట్ కమిటీలో హోల్‌సేల్ కూరగాయల వ్యాపారం జరిగే ప్రాంతం

నాసిరకం విత్తనాలు అంటగట్టారు

దుకాణం ఎదుట రైతుల ఆందోళన


విత్తన దుకాణం ముందు ఆందోళన చేస్తున్న రైతులు

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 23: తమకు నాసిరకం విత్తనాలు అంటగట్టి తీవ్రంగా నష్టపరిచారని రైతులు విత్తనాల దుకాణం ముందు ఆందోళన చేపట్టారు. శుక్రవారం ఆదోని పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని గీతా సీడ్స్ దుకాణం ముందు మండలంలోని సలకలకొండ గ్రామానికి చెందిన 15 మంది రైతులు బైఠాయించారు. గత 40 రోజుల కిందట పుచ్చకాయ విత్తనాలు దుకాణంలో కొనుగోలు చేశామని సలకలకొండ గ్రామానికి చెందిన గుర్రాల రాముడు, ఈరన్న, వీరారెడ్డి, నరసన్న, నగేష్ తెలిపారు. ఒక్కొక్కరం 20 ప్యాకెట్స్ పైగా పుచ్చకాయ విత్తనాలు కొని విత్తుకున్నామని అన్నారు. పైరు ఎదుగుదల ఉన్నా దిగుబడి రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పుచ్చకాయ చిన్న సైజు వచ్చి పగిలిపోతున్నాయని తెలిపారు. దుకాణ యజమాని దగ్గరికి వచ్చి పలుమార్లు పంటను పరిశీలించాలని కోరినప్పటికీ పట్టించుకోలేదని వాపోయారు. రైతులు రోడ్డుపై బైఠాయించడంతో పోలీసులు వచ్చి ట్రాఫిక్ అంతరాయం కలుగుతుందని సర్దిచెప్పారు. దుకాణాన్ని పోలీసులు మూయించారు. వ్యవసాయ అధికారి అందుబాటులో లేకపోవడంతో శనివారం తమకు న్యాయం చేసేలా చూస్తామని సూచించారు.

నకిలీ నోట్ల చలామణిలో ఇద్దరికి ఏడేళ్ల జైలు

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 23 : నంద్యాల పట్టణంలో నకిలీ నోట్ల చలామణి కేసులో ఇద్దరికి న్యాయస్థానం ఏడేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ.20వేల చొప్పున జరిమానా విధించింది. నంద్యాల పట్టణంలోని ఎస్పీజీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో 18-1-2017వ తేదీన రాత్రి 8గంటల సమయంలో నిందితుడు బుకింగ్ వద్దకు వచ్చి రూ.100 నోటు ఇచ్చి టికెట్ తీసుకొని లోపలికి వెళ్లాడు. కొంత సమయం తర్వాత బుకింగ్ కౌంటర్‌లోని వ్యక్తి ఆ నోటును పరిశీలించి నకిలీదని నిర్ధారించుకున్నాడు. దాన్ని ఇచ్చిన వ్యక్తిని గుర్తించాడు. అప్పటికే సదరు నిందితుడు మరొకరితో కలిసి ఎగ్జిబిషన్‌లోని మూడు కౌంటర్లవద్ద ఇలాగే రూ.100 నకిలీ నోట్లను ఇచ్చి చిల్లర తీసుకున్నట్లు గమనించి అతడిని ప్రశ్నించగా మాయమాటలు చెప్పి మెయిన్‌గేట్ నుంచి పారిపోయాడు. ఈ విషయాన్నంతా ఎగ్జిబిషన్ నిర్వాహకులు మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ ఇస్మాయిల్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో భాగంగా మూడో పట్టణ సీఐ నరసింహులు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. కేసు విచారణలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె. లక్ష్మీనారాయణ ప్రాసిక్యూషన్ తరపున వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలు రుజువైనందున నంద్యాల ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి బి. రాధారాణి నిందితులకు ఏడేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ.20వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

గెస్టు ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తులు

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 23: ప్రభుత్వ బీఎడ్ కళాశాలలో గెస్టు ఫ్యాకల్టీగా ఫిజికల్ సైన్సు సబ్జెక్టులు బోధించేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని బీ క్యాంప్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.ఆదినారాయణ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎడ్, డిగ్రీతో పాటు సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ 55 శాతానికిపైగా మార్కులతో పూర్తి చేసి ఉండాలన్నారు. సంబంధిత సబ్జెక్టులో నెట్/స్లెట్, పీహెచ్‌డీ వంటి అదనపు అర్హతలు కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. అభ్యర్థులు 42 సంవత్సరాలలోపు వయస్సు కలిగి ఉండాలని, ఎస్సీ, ఎస్టీ. బీసీ అభ్యర్థులకు 5 సంవత్సరాలు, వికలాంగులకు పది సంవత్సరాల సడలింపు ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు. వివరాలకు 99493 01100 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వేరుశనగ ధర రూ.7,392

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 23: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం వేరుశనగ ధరలు క్వింటాలు గరిష్ఠంగా రూ. 7,392 పలికింది. వారం రోజులుతో పోల్చితే వేరుశనగ క్వింటానికి రూ.800 పైగా ధర పెరిగింది. బోరుబావుల కింద సాగైన వేరుశనగను ఇప్పుడిప్పుడే రైతులు విక్రయానికి తెస్తున్నారు. ధరలు పెరుగుతుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 5843 బస్తాల వేరుశనగను రైతులు మార్కెట్ కమిటీకి తీసుకురాగా క్వింటాలు వాటి కనిష్ఠ ధర రూ.4,219, గరిష్ఠ ధర రూ.7,392, మధ్యస్థ ధర రూ.6,989 పలికింది.

కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలి

ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి



మాట్లాడుతున్న హేమచంద్రారెడ్డి

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 23: విద్యార్థి దశ నుంచి కష్టపడి చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్(యాప్షి) ప్రొఫెసర్ కే. హేమచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం రాయలసీమ యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన టెక్ ఫెస్ట్ 2కే 24 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న విద్యాదీవెనకు రూ. 15 వేల కోట్లు, విదేశీ విద్యాదీవెనకు రూ. 1.25 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ప్రపంచ స్థాయిలో విశ్వవిద్యాలయాల్లో చదువుకోలేని విద్యార్థుల కోసం ఎడెక్స్‌తో కలిసి ఖర్చుతో కూడుడిన ఆన్‌లైన్ కోర్సులను ఉచితంగా అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఉపకులపతి బీ. సుధీర్ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ చైర్మెన్ హేమచంద్రారెడ్డి నాయకత్వంలో ఉన్నత విద్యామండలి వినూత్న కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వై. హరిప్రసాద్‌రెడ్డి, రిజిస్ట్రార్ ఎన్. అంకన్న, వివిధ విభాగాల ఆచార్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్ల బదిలీలు

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 23: జిల్లాలో 24 మంది డిప్యూటీ తహసీల్దార్లను బదిలీ చేస్తూ శుక్రవారం కలెక్టర్ డా.జి. సృజన ఉత్తర్వులు జారీ చేశారు.

డీటీ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
సతీష్	ఓర్వకల్లు	అమరావతి ఎక్స్‌ప్రెస్ హైవే కర్నూలు
వహాబ్	అమరావతి ఎక్స్‌ప్రెస్ హైవే కర్నూలు	గోనెగండ్ల
వీరేంద్ర గౌడు	పెద్ద కడుమూరు	హోలగుంద
శివరాం	కర్నూలు అర్బన్	కల్లూరు
గురు రాజారావు	ఎమ్మిగనూరు	మంత్రాలయం
గిరి కుమార్ రెడ్డి	కల్లూరు	కర్నూలు అర్బన్
సహెరా బాను	కల్లూరు రూరల్	ఎమ్మిగనూరు
శివప్రసాద్	ఎమ్మిగనూరు	కల్లూరు రూరల్
రజనీకాంత్ రెడ్డి	ఆదోని	ఆలూరు
రామేశ్వరరెడ్డి	కౌతాళం	కోసిగి
లక్ష్మీనారాయణ	చిప్పగిరి	పత్తికొండ
అహ్మద్	ఆదోని	చిప్పగిరి
లక్ష్మీరాజు	గోనెగండ్ల	ఆదోని
శేఖర్‌రావు	మంత్రాలయం	ఆదోని
నిజాముద్దీన్	తుగ్గలి	కౌతాళం
రఘువీర్	నందవరం	ఎమ్మిగనూరు
విజయ్‌కుమార్	ఆలూరు	పత్తికొండ
రుద్రగౌడు	కోసిగి	పెద్దకడుమూరు
దీప	హొళగుంద	నందవరం
సుదర్శన్	దేవనకొండ	ఓర్వకల్లు
విష్ణుప్రసాద్	పత్తికొండ	కృష్ణగిరి
నాగరాజు	మద్దికెర	తుగ్గలి
గీతా ప్రియదర్శిని	కర్నూలు	మద్దికెర
రవిచంద్ర	క్రిష్ణగిరి	కర్నూలు కలెక్టరేట్ కార్యాలయం

అదేవిధంగా సార్వత్రిక ఎన్నికలలో బ్యాలెట్ పేపర్ పని నిమిత్తం డిప్యూటీ తహసీల్దార్లకు కలెక్టర్ అసెంబ్లీ స్థానాలను కేటాయించారు.

వినీత్	ఆదోని	జాకీర్ హుశేన్	కోడుమూరు
బాలరాజు	ఆలూరు	మహేష్	ఎమ్మిగనూరు
పెద్దయ్య	మంత్రాలయం	భీమేష్	పత్తికొండ

ఆస్తి పన్ను వసూళ్లలో వెనుకంజ

- 50 శాతం కూడా దాటని వైనం
- వడ్డీ మినహాయింపు కోసం ఎదురు చూపులు


ఆదోని మున్సిపల్ కార్యాలయం

ఆదోని టౌన్, ఫిబ్రవరి 23: ఫిబ్రవరి నెల పూర్తి కావస్తున్నా, పట్టణ ప్రాంతాలలోని పురపాలకలో ఆస్తి పన్నుల వసూళ్ల నెమ్మదించడంతో జిల్లాలో 50 శాతం కూడా దాటని పరిస్థితి నెలకొంది. అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదలైతే ఎన్నికల హడావుడి మొదలవుతుంది. ఫలితంగా పన్నుల వసూళ్లపై అధికారులు దృష్టి సారించే అవకాశం ఉండదు. ప్రజలకు మౌలిక వసతుల కల్పన కోసం నిధుల కొరత ఏర్పడే పరిస్థితి ఏర్పడుతుంది. జిల్లాలో కర్నూలు కార్పొరేషన్ తప్ప, ఇతర మున్సిపాలిటీలలో పన్నుల వసూళ్లు 50 శాతం కూడా చేరుకోలేదు. గత ఏడాది కన్నా, ఈ ఏడాది పన్నుల వసూళ్లు పూర్తిగా వెనుకపడ్డట్లు తెలుస్తోంది. కర్నూలు కార్పొరేషన్‌లో రూ.89.18 కోట్లకు గాను రూ.47.06 కోట్లు (52 శాతం) వసూలైంది. ఆదోని మునిసిపాలిటీలో రూ.14.77 కోట్లకుగాను, రూ.5.96 కోట్లు (40 శాతం), ఎమ్మిగనూరు మునిసిపాలిటీలో రూ.5.98 కోట్లకుగాను రూ.2.59 కోట్లు (43.30 శాతం), గూడూరు మున్సిపాలిటీలో రూ.1.20 కోట్లకుగాను రూ.50 లక్షలు (49.90) మాత్రమే ఆస్తి పన్నులను వసూలు చేశారు.

రుణమాఫీ కోసం ఎదురు చూపు

పాత బకాయిదారులతోపాటు ప్రభుత్వం వడ్డీ మాఫీ ప్రకటన చేస్తుందేమోనని చాలా మంది పన్నుల చెల్లింపును వాయిదా వేసుకుంటున్నట్లు తెలుస్తోంది. వడ్డీ మాఫీపై ప్రభుత్వం త్వరగా ప్రకటన చేస్తే వసూళ్లు పెరిగే అవకాశం ఉంటుందని పురపాలక అధికారులు అంటున్నారు. ప్రతి ఏడాది మార్చిలో వెలువడే వడ్డీ రుణమాఫీ ప్రకటనను అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఈ నెలలోనే ప్రకటించాలని పలువురు కోరుతున్నారు.

గంజాయి ముఠా అరెస్టు

6.5 కిలోల గంజాయి స్వాధీనం

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 23: గుంతకల్లు వన్‌టౌన్ పోలీసులు ఏడుగురు గంజాయి విక్రేతలను అరెస్టు చేశారు. వారి నుంచి 6.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ అన్బురాజన్ ఈ వివరాలను వెల్లడించారు. గుంతకల్లు పట్టణంలోని షికారీ కాలనీకి చెందిన షికారి నాగు, షికారి మంజుల, కర్నూలు జిల్లా మంత్రాలయం మండలం రచ్చుమర్రికి చెందిన నరసప్ప, బుక్కరాయసముద్రం మండలం రామవేంద్రకాలనీకి చెందిన నిస్సార్ అహ్మద్, అనంతపురం రూరల్ మండలం తాటిచెర్ల గ్రామానికి చెందిన మేకల ప్రసాద్, కర్నూలు జిల్లా కోసిగి మండలం పల్లెపాడుకు చెందిన ఎర్రతోట లక్ష్మణ్ణ, అదే గ్రామానికి చెందిన పోయింటి ఈరన్నను అరెస్టు చేశామని అన్నారు. షికారి నాగు, నరసప్ప, నిస్సార్ అహమ్మద్, మేకల ప్రసాద్, షికారి మంజుల ముఠాగా ఏర్పడి గంజాయి వ్యాపారం చేస్తున్నారని ఎస్పీ తెలిపారు. ఎర్రతోట లక్ష్మణ్ణ, పోయింటి ఈరన్న నుంచి వీరు గంజాయి కొనుగోలు చేస్తున్నారని వెల్లడించారు. కిలో రూ.11 వేలకు కొనుగోలు చేసి, 300 ప్యాకెట్లుగా తయారు చేసుకుంటారని, ఒక్కో ప్యాకెట్‌ను రూ.150 ప్రకారం గుంతకల్లు, అనంతపురం, బుక్కరాయసముద్రం, గుత్తి తదితర ప్రాంతాలలో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. గుంతకల్లు డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి పర్యవేక్షణలో గుంతకల్లు వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య ఆధ్వర్యంలో సిబ్బంది మూర్తి, లక్ష్మీనారాయణ, శివ, రమేష్ బృందంగా ఏర్పడి ఈ ముఠాను పట్టుకున్నారని తెలిపారు. అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.



స్వాధీనం చేసుకున్న గంజాయితో ఎస్పీ

గ్రూప్-2 పరీక్షను పకడ్బందీగా నిర్వహించండి

జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య



కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 23: జిల్లాలో ఈ నెల 25న నిర్వహించే గ్రూప్-2 సర్వీసెస్ పరీక్షలను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం సిల్వర్‌జూబ్లీ కళాశాల ఆడిటోరియంలో గ్రూప్-2 పరీక్షల నిర్వహణపై అధికారులతో సమన్వయ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 25న నిర్వహించే గ్రూప్-2 పరీక్షలు ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మొట్టమొదటిసారి గ్రూప్-2 పరీక్షల నిర్వహణకు ఐఏఎస్ అధికారి కో ఆర్డినేటింగ్ అధికారిగా ప్రభుత్వం నియమించిందన్నారు. ఈ నెల 25న ఉదయం 10.30 గంటల నుంచి 1 గంట వరకు ఓఎంఆర్ ఆధారంగా స్క్రీనింగ్ టెస్టు (ఆబ్జెక్టివ్ టైప్) ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో కర్నూలు నగరం, కోడుమూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు, ఆదోనిలోని 126 సెంటర్లలో 36వేల మంది గ్రూప్-2 పరీక్షలు రాస్తున్నారన్నారు. విశాఖపట్నం తర్వాత కర్నూలు జిల్లాలోనే అధికంగా ఈ పరీక్షలు రాస్తున్నారన్నారు. గ్రూప్-2 పరీక్షల అభ్యర్థుల సౌకర్యార్థం జిల్లా కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్క్‌తో కూడిన కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ డా.జి.సృజన తెలిపారు. 8886884766 ఈశ్వర్ డి సెక్షన్, జూనియర్ అసిస్టెంట్, 8142460214 శ్రీనివాసులు, గ్రీవెన్స్ సెక్షన్ జూనియర్ అసిస్టెంట్, 08518-277305 ల్యాండ్ లైన్ నెంబరు అందుబాటులో ఉంటాయని కలెక్టర్ తెలిపారు.

తూనికలు, కొలతల శాఖ తనిఖీలు

6 కేసులు నమోదు, అపరాధ రుసుం వసూలు

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 23: కర్నూలు నగరంలోని వివిధ ప్రాంతాల్లో తూనికలు, కొలతల శాఖ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. శుక్రవారం మండిబజార్, పాతబస్తీ, రాజ్‌థియేటర్ వద్ద కూల్‌డ్రింక్, కిరాణ, హార్డ్‌వేర్, బేకరీలలో దాడులు నిర్వహించి రికార్డులను పరిశీలించారు. పలు చోట్ల ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయాలు చేయడం, తూనిక రాళ్లకు ముద్రలు లేకపోవడం, ప్యాకేజీలపై డిక్లరేషన్ లేకపోవడంతో ఆరు కేసులను నమోదు చేసి రూ.18 వేల అపరాద రుసుం విధించారు. ఈ సందర్భంగా ఇన్స్‌పెక్టర్ పరమేశ్వరకుమార్ మాట్లాడుతూ ఎవరైనా దుకాణదారులు ఎక్కువ ధరకు అమ్మినా, తూనికపు యంత్రాలు, రాళ్లకు ముద్రలు లేకుండా వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి చిన్న ప్రకటన - పెద్ద స్పందన CLASSIFIEDS

CHANGE OF NAME
I, **AKBAR BHASHA** (Old Name) R/o.H.No: 36-46-28A-1, Kummari Nagayya Street, Kurnool dist, AP., I have changed my name as **SHAIK AKBAR BASHA** (New Name)
AJL- 180322

CHANGE OF NAME
I, **SHAIK MALIQ BASHA** (Old Name) R/o.H.No:54-11, Fort area Kurnool dist, AP., have changed my name as **SHAIK MALIK BASHA** (New Name)
AJL- 180322

CHANGE OF NAME
I, **MOHAMMED IBRAHIM** S/O SHUKUR MIAH LATE (Old Name) R/o.H.No:32-454, Gadda Street, Near One Town, Kurnool dist, AP., have changed my father name as **ABDUL SHUKUR LATE** (New Name)
AJL-180406

JOB NOTIFICATION
SARDS సంస్థ కర్నూలు ఆధ్వర్యంలో అమలు అవుతున్న గ్రామీణ అభివృద్ధి ప్రాజెక్ట్‌లో పనిచేయుటకు Degree/ PG మరియు అనుభవం కలిగిన అభ్యర్థులు కావలెను. ఆసక్తి గల అభ్యర్థులు sards 2023@gmail.com ఈ Mail IDకి మీ యొక్క బయోడెటాను పంపించగలరు.
AJL-180225

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర॥ **7382114647**
AJA- 176964

HOUSE FOR SALE
కొత్తగా, నాణ్యవంతంగా నిర్మించిన ఇల్లు (2BHK) అమ్మకంనకు కలదు. (తిరుమలగిరి – డోన్ రోడ్, కర్నూలు నందు.) Contact : **63043 88820**
AJL-1180098

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి



రియల్ దందా కోసమే కార్యాలయం మార్పు: మాండ్ర

నందికొట్కూరు, ఫిబ్రవరి 23: రియల్ ఎస్టేట్ దందా కోసమే నందికొట్కూరు మున్సిపాల్టీని మురికి కూపం సమీపంలో నిర్మించేందుకు వైసీపీ నాయకులు శంకుస్థాపన చేశారని టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి ఆరోపించారు. శుక్రవారం నందికొట్కూరు టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. మాండ్ర మాట్లాడుతూ ప్రస్తుతం 5 ఎకరాల్లో ఉన్న నందికొట్కూరు మున్సిపాల్టీని రెండెకరాల్లోకి మార్చడమే అభివృద్ధా? అని ఆయన ప్రశ్నించారు. అన్ని వసతులున్న చోటు నుంచి పట్టణానికి దూరంగా ఉన్న ప్రదేశానికి మున్సిపల్ కార్యాలయాన్ని మార్చాల్సిన అవసరం ఏముందన్నారు. కేవలం మున్సిపల్ చైర్మన్, ఇన్‌చార్జిలు అక్కడ పొలాలు కొనుగోలు చేశారు కాబట్టే వాటి విలువ పెరిగేందుకే మున్సిపల్ నూతన కార్యాలయాన్ని నిర్మించేందుకు శంకుస్థాపనలు చేస్తున్నారన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయాన్ని బయటకు తరలించడాన్ని పట్టణ ప్రజలు వ్యతిరేకిస్తున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక మున్సిపల్ కార్యాలయాన్ని ప్రస్తుతం ఉన్న చోటే అధునాతనంగా నిర్మిస్తామని ఆయన తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

● పాత్రికేయులపై, పత్రికా సంస్థల కార్యాలయాలపై వైసీపీ మూకలు దాడి చేయడం సరికాదని లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. అభివృద్ధి శూన్యమని, దీంతో అభద్రతా భావంతో వైసీపీ ప్రభుత్వం ఉందని, అందులో భాగంగానే ప్రశ్నించిన వారిపై దాడులు చేసేందుకు వైసీపీ మూకలు సిద్ధమయ్యాయన్నారు. ఐదేళ్ల కాలంలో జగన్మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలు విసిగిపోయారన్నారు. జగన్మోహన్‌రెడ్డిని ఇంట్లోనే ఉంచేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధమయ్యారన్నారు.

● గౌరు చరితారెడ్డి, మాండ్ర శివానందరెడ్డి వైసీపీలో చేరుతున్నారని అబూత కల్పనలు, ఊహాగానాలు వస్తున్నాయని, ఇలాంటి అవాస్తవాలను ప్రజలు నమ్మవద్దని మాండ్ర శివానందరెడ్డి సూచించారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, గిరీశ్వర్‌రెడ్డి, జయసూర్య, లాయర్ జాకీర్, తదితర నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాండ్ర శివానందరెడ్డి

'జయహో బీసీ' సభను జయప్రదం చేయాలి
● టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్


మాట్లాడుతున్న మల్లెల రాజశేఖర్

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 23: నంద్యాలలో ఈనెల 26వ తేదీన జరగబోయే నంద్యాల జిల్లా స్థాయి జయహో బీసీ మహాసభను జయప్రదం చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ పిలుపునిచ్చారు. శుక్రవారం నంద్యాలలోని టీడీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో జయహో బీసీ మహాసభ విజయవంతం కోసం సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌తో పాటు టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు ఏవీఆర్ ప్రసాద్, ప్రముఖ సీనియర్ న్యాయవాది తాతిరెడ్డి తులసిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, టీడీపీ బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు. మహాసభను నిర్వహించే ప్రాంతాన్ని వారు పరిశీలించారు. మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ పార్టీ గెలుపు కోసం నాయకులందరూ ఏకతాటిపైకి వచ్చి విజయానికి కృషి చేయాలని కోరారు. పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే వారిపై క్రమ శిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయి
● మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి


నంద్యాలలో ప్రచారం నిర్వహిస్తున్న భూమా బ్రహ్మానందరెడ్డి

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 23: వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయని టీడీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి అన్నారు. శుక్రవారం ఇంటింటికి బ్రహ్మన్న కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. స్థానిక తులసీ వనంలోని టీడీపీ కార్యాలయం నుంచి భారీ బైక్ ర్యాలీతో బయలుదేరారు. పట్టణంలోని 6వ వార్డులో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి టీడీపీ చేపట్టే మినీ మేనిఫెస్టో, సూపర్ 6 పథకాల గురించి ప్రజలకు వివరించారు. వార్డులోని ప్రజల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక, దౌర్జన్యం, రౌడీయిజం పాలన సాగిందని, ఒక్క అవకాశంతో ప్రజలు జగన్‌రెడ్డి పాలనను చూశారని ఎద్దేవా చేశారు. నంద్యాలలో అభివృద్ధి టీడీపీ హయంలోనే జరిగిందని చెప్పారు. స్థానికంగా నంద్యాలలో అభివృద్ధిని విస్మరించి బియ్యం, ఇసుక మాఫియా, భూ కబ్జాలు, మున్సిపాలిటీకి చెందిన స్థలాలను వైసీపీ కార్యకర్తల ఆక్రమణలు చేసి ప్రజా ధనాన్ని దోచుకున్నారని ఆరోపించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి'


మాట్లాడుతున్న ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి

బండిఆత్మకూరు, ఫిబ్రవరి 23: గ్రామాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలపై పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలని మండల పరిషత్ అధ్యక్షుడు దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి సూచించారు. బుధవారం బండిఆత్మకూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ అధ్యక్షతన పరిపాలన అధికారి హనీఫ్‌ఖాన్ నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ వేసవి వస్తున్నందున ఎలాంటి నీటి ఎద్దడి తలెత్తకుండా కార్యదర్శులు జాగ్రత్త వహించాలన్నారు. సమావేశానికి ఆలస్యంగా వచ్చిన అధికారులపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. ప్రభుత్వ మద్యం దుకాణాల వద్దనే షిటింగ్ ఏర్పాటు, విచ్చలవిడిగా గ్రామాల్లో బెల్టు షాప్‌ల నిర్వహణ, కేసులు కేసులే మందు ఒకేసారి ఇస్తున్నారని, అడ్డుకట్టలేదా అని సభ్యులు సభ దృష్టికి తేగా.. ఎక్సైజ్ ఎస్ఐ సుబ్బయ్య వెంటనే విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం పలుశాఖల మండల అధికారులు తమ శాఖల ప్రగతిని సభకు వివరించారు. జడ్పీటీసీ రామతులశమ్మ, వైస్ ఎంపీపీ వెంకటరమణ, మధురాణి, డీఈ సుంకిరెడ్డి, ఏఈలు లక్ష్మీనరసింహా, వెంకటయ్య, ఏపీఎ రాజశేఖర్‌రెడ్డి, ఈహెచ్‌పీఆర్డీ శ్రీనివాసులు, బీసీ హాస్టల్ వార్డెన్ గంగాధరగౌడ్, ఏపీఎం నాగార్జున, సూపర్‌వైజర్ రమాదవి కార్యదర్శులు పాల్గొన్నారు.

'రైతులపై కాల్పులు దారుణం'


ఆత్మకూరులో నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

నందికొట్కూరు, ఫిబ్రవరి 23: రైతులు గిట్టుబాటు ధర అడిగితే కాల్చి చంపుతారా..?, ఇది దారుణమైన చర్య అని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రఘురామ్మూర్తి అన్నారు. మోదీ ప్రభుత్వ నిరంకుశ వైఖరి నిరసిస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం నందికొట్కూరులో రాస్తారోకో నిర్వహించారు. పంజాబ్ హర్యానా సరిహద్దుల్లో రైతుల మీద జరిగిన కాల్పులను, యువరైతు శోభాకర్ సింగ్ మృతిని నిరసిస్తూ దేశవ్యాప్తంగా బ్లాక్ డేగా ప్రకటించారన్నారు. ఏఐటీయూసీ జిల్లా నాయకులు రమేష్‌బాబు, సీపీఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ నాయకులు మహానంది, వినోద్, రైతు సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు

ఆత్మకూరు: కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తుందని ఆరోపిస్తూ శుక్రవారం సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదుట నల్లరిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, సీఐటీయూనాయకులు రజాక్, రామ్‌నాయక్, రణధీర్, వ్యవసాయ కార్మి సంఘం జిల్లా కార్యదర్శి నరసింహా, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్ మాట్లాడారు. పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించాలి డిమాండ్ చేస్తున్న రైతులపై పోలీసు బలగాలచే కాల్పులు జరపడం సరికాదని అన్నారు. ఆయా సంఘాల నాయకులు మాబాషా, వీరన్న, ఇస్మాయిల్, సురేంద్ర, శివకుమార్, రాము, రవి, విజయ్ ఉన్నారు.

నేడు వేలం పాటలు

ఆత్మకూరు, ఫిబ్రవరి 23: ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వేలం పాటలను శనివారం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31వ తేది వరకు మున్సిపాలిటీ పరిధిలో వారాంతపు సంత మార్కెట్, దినసరి కూరగాయల మార్కెట్, బస్టాండ్ ఫీజులు, చిన్నకమేలా, పెద్దకబేళా, చేపలు, చికెన్ అమ్మకాలకు సంబంధించి వేలాలను జరపనున్నట్లు వివరించారు. ఆసక్తి గల పాటదారులు ఆ వేలాలకు నిర్ణయించిన డిపాజిట్ చెల్లించి వేలాల్లో పాల్గొనవచ్చునని తెలిపారు. హెచ్చుపాటదారుడు 18శాతం అదనంగా జీఎస్టీ చెల్లించాల్సి వుంటుందని అన్నారు. పట్టణంలోని అన్నక్యాంటీన్ కార్యాలయంలో శనివారం ఉదయం 11గంటలకు జరిగే ఈ వేలం పాటలను పాటదారులు హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించవచ్చునని వివరించారు.

'చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి'


నందికొట్కూరులో పాల్గొన్న టీడీపీ నాయకులు

నందికొట్కూరు ఫిబ్రవరి 23: రాష్ట్రాభివృద్ధి జరగాలన్న, యువతకు ఉద్యోగ అవకాశాలు రావాలన్నా టీడీపీ అధినేత చంద్రబాబుతోనే సాధ్యమని నందికొట్కూరు క్లస్టర్ ఇన్‌చార్జి జాకీర్ అన్నారు. శుక్రవారం నందికొట్కూరు పట్టణంలోని 15వ వార్డులో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని వార్డు ఇన్‌చార్జి గోవర్ధనగిరి, టీడీపీ పట్టణ మహిళా అధ్య క్షులు మీనాక్షి ఆధ్వర్యంలో నిర్వహించారు. టీడీపీ మహిళా నాయకులు సత్యమ్మ, రూబీయా, కవిత, లక్ష్మి, మాలతీ, చిట్టెమ్మ, అనిత, శ్రీనిధి పాల్గొన్నారు. అలాగే మిడుతూరు మండలం అలగనూరు గ్రామంలో 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు నిర్వహించారు. టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం చేస్తూ భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు.

నిత్యాన్నదాన భవనం పరిశీలన

శ్రీశైలం, ఫిబ్రవరి 23: శ్రీశైలం దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న అన్న ప్రసాద వితరణ భవనాన్ని శుక్రవారం ఆలయ కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు పరిశీలించారు. పరిశీలనలో భాగంగా వంటశాలు, భక్తులు వేచి వుండే గదులు, అన్నప్రసాద వితరణ శాలలను పరిశీలించారు. ఈవో మాట్లాడుతూ మార్చి 1 నుంచి 11 వరకు జరగబోయే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను దృష్టిలో ఉంచుకుని అన్నప్రసాద వితరణకు ఆయా ఏర్పాట్లు చేయాలన్నారు.

విస్తరాకుల విరాళం

శ్రీశైలం, ఫిబ్రవరి 23: శ్రీశైలం దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన ప్రసాద వితరణ భవనానికి శుక్రవారం లక్ష విస్తరాకులను చీరాలకు చెందిన భ్రమరాంబికా సేవాసమితి వారు విరాళంగా అందజేశారు. మార్చి 1 నుంచి 11 వరకు జరిగే మహా శివరాత్రి బ్రహ్మోత్స వాల సందర్భంగా వీటిని అందజేసినట్లు భ్రమరాంబికా సేవాసమితి అధ్యక్షురాలు ఎంపీ మహాలక్ష్మి తెలిపారు. ఈ విరాళాన్ని అన్నపూర్ణ భవనం నందు ఆలయ ఈవోకు అందజేశారు. విస్తరాకుల విలువ రూ.3 లక్షలకు పైగా ఉంటుందని భక్తులు తెలిపారు. అన్నప్రసాద విభాగం సహాయ కార్యనిర్వహణాధికారి యం. ఫణిదర్‌ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు ఇంటి పట్టాల పంపిణీ

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 23: నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం కింద పేదల పేరిట రిజిష్టర్ చేసిన 8వేల ఇళ్ల పట్టాలను కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. శుక్రవారం ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సీఎం జగన్ నిరుపేదలకు రిజిస్టర్ చేసిన ఇంటి స్థలం కన్వేయన్స్ డీడ్స్, ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు, ఎంఎస్ఎంఈ రాష్ట్ర డైరక్టర్ ఖాజీ అబ్దుల్‌కలాం తదితరులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. కార్యక్రమం అనంతరం లబ్ధిదారులకు రిజిస్టర్ చేసిన కన్వేయన్స్ డీడ్స్, ఇళ్ల పట్టాల పత్రాలను పంపిణీ చేశారు. రెవెన్యూ డివిజనల్ అధికారి మల్లికార్జునరెడ్డి,తాసిల్దార్ చంద్రశేకర్ పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ బాధిత చిన్నారులకు చేయూత

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 23: నంద్యాలలోని హెచ్‌ఐవీ బాధిత చిన్నారులకు రామకృష్ణా విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి ఆర్థికంగా చేయూతగా నిలిచారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో రెడ్‌క్రాస్ సోసైటీ సిబ్బంది, కేర్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రతి నెలా హెచ్‌ఐవీ బాధిత చిన్నారులకు పౌష్టికాహారం, మందులకు అవసరపడేందుకు రూ.25 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న క్రమంలో ఈ నెలకు అవసరమయ్యే నగదును డాక్టర్ రామకృష్ణారెడ్డి అందజేశారు. గత రెండు సంవత్సరాలుగా హెచ్‌ఐవీ బాధిత చిన్నారులకు అండగా ఉన్న డాక్టర్ రామకృష్ణారెడ్డిని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, హెచ్‌ఐవీ బాధిత కేంద్ర నిర్వాహకులు అభినందించారు. రామకృష్ణా విద్యాసంస్థల మేనేజర్ ప్రగతిరెడ్డి, విద్యాసంస్థల కార్యదర్శి విజయకుమారి, కళాశాల ప్రిన్సిపల్ సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

సారా స్వాధీనం

కొత్తపల్లి, ఫిబ్రవరి 23: వీరాపురం శివారులోని నల్లమల అటవీ ప్రాంతంలో కొత్తపల్లి ఎస్ఐ హరిప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది బెల్లం ఊటను ధ్వంసం చేసి నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ తెలిపిన వివరాలివీ.. నల్లమలలోని సోలార్ కుంట వద్ద సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 5,200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అలాగే 25 ప్లాస్టిక్ డ్రమ్ములు, ఇనుప డ్రమ్ములు, సారా తయారు చేసే చెక్క, మట్టికుండలను ధ్వంసం చేసినట్లు తెలిపారు. సిబ్బంది ప్రసాద్ నాయక్, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

'పథకాలు కేంద్రానివి.. ప్రచారం రాష్ట్రానిది'

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 23: కేంద్ర ప్రభుత్వ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తూ తామే చేపట్టినట్లు ప్రచారం చేసుకోవడం దుర్మార్గమని బీజేపీ నంద్యాల కన్వీనర్ అభిరుచి మధు అన్నారు. నంద్యాల పట్టణంలోని బైరమల్ వీధి, చైనాబజార్‌లో శుక్రవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మధు మాట్లాడుతూ ప్రజాపోరు యాత్రను రెండు రోజులుగా పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో నిర్వహిస్తూ కేంద్ర పథకాల గురించి వివరించామని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల రూరల్: జగన్ రాక్షస పాలన నుంచి విముక్తి కోరుకుంటున్నారని, రాష్ట్రంలో ప్రభుత్వ దోపిడీ తప్ప ఎక్కడా అభివృద్ధి కనిపించటం లేదు అని బీజేపీ నంద్యాల కన్వీనర్ అన్నారు. నంద్యాల మండలంలోని గుంతనాల, మిట్నాల, పుసులూరు, పాండురంగాపురం, బాపూజీ నగర్, చాపిరేవుల, వెంకటేశ్వర పురం గ్రామాలతో పాటు ఆటో నగర్‌లో శుక్రవారం ప్రజా పోరు యాత్ర నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యేపై ఆరోపణలు గుప్పిస్తూ వారానికి ఒక్కసారి మాత్రమే వచ్చి ఫోటోలకు ఫోజులు ఇచ్చే శిల్పా కుటుంబం గ్రామాల్లో ఎక్కడ అభివృద్ధి చేసిందని ప్రశ్నించారు. ప్రజా పోరు యా త్రలో ప్రసాదరావు, శివ నరసింహ గౌడ్, రవీంద్రారెడ్డి, లక్ష్మీ రెడ్డి, మండల కన్వీనర్ గురు బ్రహ్మ, నంద్యాల పట్టణ అధ్యక్షులు కొశెట్టి చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

పగిడ్యాల, ఫిబ్రవరి 23: పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఖోఖో క్రీడాకారులకు జడ్పీటీసీ పుల్యాల దివ్య శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతు ఖోఖో రాష్ట్ర స్థాయి పోటీలకు సంబంధించి జట్టు ఎంపికకు శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 24 నుంచి 27 వరకు పశ్చిమ గోదావరి జిల్లా సామర్లకోటలో రాష స్థాయి ఖోఖో పోటీలలో జిల్లా జట్టు పాల్గొంటుందని చెప్పారు. రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. సర్పంచ్ శేషన్న, ఖోఖో సెక్రటరి ప్రబాకర్, క్రీడా శ్రీ పీతాంబరరెడ్డి తదితరులు ఉన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 23: నంద్యాల జిల్లా వ్యాప్తంగా పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. జిల్లా సరిహద్దుల్లోని చెక్‌పోస్టులలో అక్రమ రవాణాకు అడ్డుకట్టవేసేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. అక్రమ మద్యానికి అడ్డుకట్ట వేసేందుకు రహదార్లలో వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ప్రధాన రహదార్లతో పాటు పట్టణాల్లో ముఖ్య కూడళ్లవద్ద పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ చేపట్టారు. ఎన్నికలు సమీపిస్తున్నందున గ్రామాల్లో నెలకొన్న తాజా పరిస్థితులపై ప్రజలకు అవగాహన కల్పించి ప్రశాంతంగా జీవించాలని సూచించారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచారు. అపరిచితవ్యక్తులు ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. గ్రామాల్లో ప్రజలంతా సోదరభావంతో మెలగాలని కోరారు. నాటుసారా, మద్యం అక్రమ తరలింపు, విక్రయాలు సాగిస్తున్నవారిపై 22కేసులు నమోదు చేసి 21మందిని అరెస్ట్ చేసి 230లీటర్ల నాటుసారాతోపాటు 324మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. అలాగే సుమారు 1400లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. నందివర్గం, బనగానపల్లె పోలీస్ స్టేషన్ల పరిధిల్లో జూద గృహాలపై దాడులు చేసి 14మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.36,140 స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. రోడ్డు భద్రతా, ట్రాఫిక్ నిబంధనలను పాటించని వారినుంచి రూ.26,915 జరిమానా రూపంలో వసూలు చేసినట్లు పోలీసులు వివరించారు. అలాగే మద్యం తాగి వాహనాలు నడిపిన 8 కేసులు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిని కనిపెట్టి 13కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

'జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి'

నంద్యాల టౌన్, ఫిబ్రవరి 23: జిల్లాలోని మండల కేంద్రాలల్లో పౌర సరఫరాల శాఖ ద్వారా జొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.రాజశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్ఎస్ రోడ్డులోని గిడ్డంగుల కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రం వద్ద రైతులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకునేందుకు రైతు సంఘం నాయకులు వచ్చారు. రైతు సంఘం జిల్లా నాయకులు సురేష్, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి'

ఆత్మకూరురూరల్, ఫిబ్రవరి 23: మండలంలో ఆరోగ్య సురక్ష పేరిట వైద్యాధికారుల ఆధ్వర్యంలో నిర్వహించే వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.శ సుక్రవారం సిద్ధాపురం గ్రామంలో వైద్యాధికారులు రాయుడు, గోపాల్, పవన్‌కుమార్ ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో ఆరోగ్య సురక్ష క్యాంపును నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, సీహెచ్‌వో ఖుద్దూస్ బాషా, సూపర్‌వైజర్ రమణమ్మ వైద్య సిబ్బంది, ఆశా, అంగన్‌వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

'చర్చల పేరుతో కాలయాపన'

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 23: రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఏర్పాటు చేసిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ఉద్యోగ, ఉపాధ్యాయ డిమాండ్లపై సానుకూలంగా స్పందించకుండా కాలయాపన చేస్తోందని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నగిరి శ్రీనివాసులు అన్నారు. ఈనెల 27వ తేదీన ఏపీ జేఏసీ తలపెట్టి చలో విజయవాడ కార్యక్రమంలో పాల్గొనకూడదని, పాల్గొంటే చర్యలు తీసుకుంటామని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నగిరి శ్రీనివాసులుకు నంద్యాల త్రీటౌన్ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ సత్యనారాయణ పోలీస్ స్టేషన్‌లో నోటీసులు అందజేశారు. శ్రీనివాసులు మాట్లాడుతూ నోటీసులతో, అక్రమ అరెస్టులతో ఉద్యమాలను నీరుగార్చే విధంగా ప్రభుత్వం వ్యవహరించడం అప్రజాస్వామికమని అన్నారు.

వైభవంగా శ్రీగిరి ప్రదక్షిణ

శ్రీశైలం, ఫిబ్రవరి 23: శ్రీశైల మహాక్షేత్రంలో శుక్రవారం పౌర్ణమి ఘడియలను పురస్కరించుకొని శ్రీశైల గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని దేవస్థానం వైభవంగా నిర్వహించింది. సాయంత్రం స్వామి, అమ్మవార్ల మహా మంగళ హారతుల అనంతరం ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకీలో ఊరేగింపుగా గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని ప్రారంభిం చారు.

భ్రమరాంబికాదేవికి లక్ష కుంకుమార్చన

శ్రీశైల మహాక్షేత్రంలో పౌర్ణమి ఘడియలను పురస్కరించుకొని సాయంత్రం భ్రమరాంబ అమ్మవారికి లక్ష కుంకుమార్చనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ముందుగా అర్చకస్వాములు పూజా సంకల్పం పఠించి అనంతరం మహాగణపతికి పూజలు చేశారు. తరువాత శాస్త్రోక్తంగా లక్ష కుంకుమార్చనను జరిపించారు. భక్తులు వారి గోత్ర నామాలతో లక్ష కుంకుమార్చనలో పాల్గొనేందుకు దేవస్థానం పరోక్ష సేవ ద్వారా అవకాశం కల్పించింది. శ్రీశైల క్షేత్రానికి స్వయంగా విచ్చేయ లేని భక్తులు వారి గోత్ర నామాలతో ఆయా ఆర్జిత సేవలలో పాల్గొనేందుకు ఆన్‌లైన్ ద్వారా రూ.1,116 సేవారుసుమును చెల్లించి పరోక్ష సేవలో పాల్గొనవచ్చు. కాగా వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు మొత్తం 37 మంది భక్తులు ఈ సేవలో పాల్గొన్నారు. భక్తులు ఈ పరోక్ష సేవ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దేవస్థానం ఈవో డి. పెద్దిరాజు కోరారు.


గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్న దృశ్యం

ఊయల సేవ, పల్లకీ ఉత్సవం

శ్రీశైల క్షేత్రంలో లోకకల్యాణార్థం పౌర్ణమిని పురస్కరించుకొని స్వామి, అమ్మవార్లకు ఊయల సేవ, పల్లకీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో నిర్వహించిన ఉత్సవ కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతికి ప్రత్యేక పూజలు చేశారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు నిర్వహించి పల్లకీలో ఆశీనులనుజేసి ఆలమ్మవారి ఆలయ ప్రాంగణంలో వైభవంగా ఉత్సవాన్ని నిర్వహించారు.

జంబులా పరమేశ్వరి బోనాల ఉత్సవాలు


హోమంలో పాల్గొన్న భక్తులు

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 23: నంద్యాల పట్టణంలో వెలసిన జంబులా పరమేశ్వరీదేవి బోనాల పండుగ ఉత్సవాలను శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి శ్రీసూక్త విధాన క్షీరాభిషేకాలు, చండీ హోమాలు నిర్వహించారు. మాడుగుల నాగేంద్రశర్మ ఆచారత్వంలో హోమాలు నిర్వహించారు. ఆలయ శాశ్వత అధ్యక్షురాలు గాండ్ల రాజేశ్వరి, ప్రధాన కార్యదర్శి జగన్‌మోహన్, భక్తులు పాల్గొన్నారు.

రేపు కంచి కామకోటి పీఠాధిపతి రాక

మహానంది, ఫిబ్రవరి 23: మహానంది క్షేత్రానికి ఆదివారం కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు విజయేంద్ర సరస్వతీ వస్తున్నట్లు ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. గురు వారం రాత్రి శ్రీశైలంలో ఉన్న పీఠాధిపతిని ఆలయ వేదపండితులతో కలసి మహానంది రావాలని ఆహ్వానించినట్లు తెలిపారు. ఈనెల 25, 26 వ తేదిల్లో కంచికామకోటి పీఠాధిపతి మహానంది క్షేత్రంలో పూజలు నిర్వహిస్తారని చెప్పారు. ఆలయ వేదపండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వరశర్మ, నిత్యాన్నదాన సత్రం కురగాయల దాత లక్కబోయిన ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

'బాల్య వివాహాలు అరికట్టాలి'

పగిడ్యాల, ఫిబ్రవరి 23: గ్రామీణ ప్రాతాలలో బాల్య వివాహాలు జరుగకుండా ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీవో కవిరాజ్ సిబ్బందికి సూచించారు. పగిడ్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. వైద్యాధికారి అనిల్‌ను అడిగి తెలుసుకున్నారు.

ముగిసిన భీష్మ ఏకాదశి హోమాలు


హోమం నిర్వహిస్తున్న శివయోగేంద్ర సరస్వతి స్వామీజీ

కొత్తపల్లి, ఫిబ్రవరి 23: కొలనుభారతి పుణ్యక్షేత్రంలో భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని కాకనూరు శారదామఠం పీఠాధిపతులు శివ యోగేంద్ర సరస్వతి స్వామీజీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన హోమాలు శుక్రవారం ముగిశాయి. ప్రాతఃకాల సమయంలోనే సరస్వతి అమ్మవారిని మంగళవాయిద్యాలతో మేలుకొల్పి 5.30 గంటలకు చారుగోషిణి నది జలాలచే అభిషేకించిన అనంతరం పంచామృతాభిషేకములు, అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో లక్ష్మీగణపి, చండీ, మహాసరస్వతి హోమాలు అశేష భక్త జనం మధ్య స్వామీజీ జరిపించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ 65వ భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని కొలనుభారతి అమ్మవారి దివ్య అనుభవంతో సద్గురు సరస్వతి నారాయణ స్వామి ఆశిస్సులతో ప్రతి ఏడాది అమ్మవారి సన్నిధిలో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలనే హోమాలు ఆనవాయితీగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి కర్నూలు విజ్ఞానపీఠంపాఠశాల కార్యదర్శి గురుమూర్తి, భక్త కన్నప్ప గురుకులం కార్యదర్శి రఘురాముడు పాల్గొన్నారు. భక్తులకు స్థానిక ఆర్యవైశ్య సత్రం, కాశిరెడ్డినాయన ఆశ్రమంతో పాటు స్వామీజీ కూడా ఆలయ ప్రాంగణంలో భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

నిబంధనలు అమలు చేయాలి: కలెక్టర్

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 23: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేసే అంశాలపై కచ్చితమైన నిఘా ఉంచి ప్రతి విషయాన్ని నమోదు చేసుకోవాలని కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్, వీడియో సర్వైలెన్స్ టీమ్స్, వీడియో వ్యూవింగ్ బృంద అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో సాధారణ ఎన్నికలు-2024లో భాగంగా ఎంసీసీటీ, ఎస్ఎస్టీ, వీఎస్టీ, వీవీటీ, ఎఫ్ఎస్టీ బృందాలకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ ఎస్పీ రఘువీర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని అధికారులకు సూచించారు. నియోజకవర్గాల వారీగా బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సివిజల్ యాప్, ఎలక్షన్ సీజర్ మేనేజ్మెంట్ సిస్టం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల్లో మద్యం, డబ్బు, ఇతర వస్తువులు రవాణా కాకుండా ఐటీ, ఎన్ఫోర్స్‌మెట్ శాఖలు ప్రధాన పాత్ర పోషిస్తాయన్నారు. ఏరోజు వచ్చిన ఫిర్యాదులను ఆరోజే పరిశీలించి రిపోర్టులు ఇవ్వాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ అధికారులకు అందుబాటులో ఉంటామని, ఎలాంటి సమస్యలు, సందేహాలు నెలకొన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో డీఆర్వో పద్మజ తదితరులు పాల్గొన్నారు.

మహిళా హ్యాండ్ బాల్ పోటీలు ప్రారంభం

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 23: నంద్యాలలో 52వ రాష్ట్ర స్థాయి మహిళల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. నంద్యాల రామలింగారెడ్డి డిగ్రీ మహిళల కళాశాల క్రీడామైదానంలో ప్రారంభమైన పోటీలకు అడిషినల్ ఎస్పీ కె.ప్రవీణ్‌కుమార్, హాకీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు చాణిక్యరాజు, ప్రభుత్వ మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అనంత్‌కుమార్‌లు ముఖ్య అతిథులుగా హాజరై పోటీలు ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 జిల్లాల నుంచి క్రీడాకారిణీలు పోటీలో పాల్గొనేందుకు వచ్చారు. ఆయా జట్ల క్రీడాకారిణీల గౌరవ వందనాన్ని అతిథులు స్వీకరించారు. హ్యాండ్ బాల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు, కర్నూలు ఒలింపిక్ సంఘం కార్యదర్శి రామంజనేయులు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి సుధాకర్, హ్యాండ్‌బాల్ సంఘం జిల్లా ప్రతినిధులు మహబూబ్‌బాషా, రాజ్‌కుమార్‌రెడ్డి, గంగాధర్ పాల్గొన్నారు.

'విమర్శించే అర్హత లేదు'


మాట్లాడుతున్న మోహన్‌రావు

నంద్యాల టౌన్, ఫిబ్రవరి 23: సోనియా, రాహుల్‌గాంధీ కుటుంబాన్ని విమర్శించే స్థాయి విజయసాయిరెడ్డికి లేదని పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతల మోహన్‌రావు అన్నారు. శుక్రవారం డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో చింతలయ్య మాట్లాడారు. ఇష్టానుసారంగా మాట్లాడడం తగదన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు చింతలయ్య, పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల రక్తదానం

పాణ్యం, ఫిబ్రవరి 23: మండలంలోని శాంతిరాం ఇంజనీరింగ్ విద్యార్థులు రక్తదానం చేశారు. శుక్రవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శాంతిరాం మెడికల్ కళాశాల, జనరల్ ఆసుపత్రి రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 60 మంది ఇంజనీరింగ్ విద్యార్థులు రక్తదానం చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ నాగరాజు, మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ తబితసుప్రియ, బ్లడ్ బ్యాంకు ఇంచార్జి సురేష్‌బాబు, వలంటీర్లు పాల్గొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

యూటీఎఫ్ నేతలకు ముందస్తు నోటీసులు




ప్యాపిలి, బనగానపల్లెలో యూటీఎఫ్ నాయకులకు నోటీసులు అందజేస్తున్న పోలీసులు

ప్యాపిలి, ఫిబ్రవరి 23: సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 27న తలపెట్టిన ఛలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లకుండా శుక్రవారం సంఘం నేతలకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. పాఠశాలలకు వెళ్లి పోలీసులు నేతలకు నోటీసులు ఇచ్చారు. ప్రభుత్వ తీరుపై యూటీఎఫ్ నేతలు మండిపడుతున్నారు. తాము శాంతియుతంగా ఆందోళనలు చేస్తుంటే ప్రభుత్వం అడుగడుగున అడ్డుపడటం విచారకరమన్నారు.

బనగానపల్లె: బనగానపల్లె పట్టణంలో జిల్లా యూటీఎఫ్ సహాధ్యక్షుడు సత్యప్రకాశ్, మండల శాఖ అధ్యక్షుడు ప్రతాప్‌కు శుక్రవారం నోటీసులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీ జేఏసీ ఈనెల 27న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లకుండా ఆంక్షలు విధించడం దారుణమన్నారు. ఒకవైపు చర్చలకు పిలుస్తూనే మరోవైపు నోటీసులు అందించడం ప్రభుత్వ ద్వంద్వవైఖరికి నిదర్శనమన్నారు. వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీ అయితే మ్యానిఫెస్టోలో సీపీఎస్ రద్దు చేసి ఆర్థిక బకాయిలు సకాలంలో చెల్లిస్తామని హామీ ఇస్తారో వారికి తమ మద్దతు ఉంటుందన్నారు.

'టీడీపీతోనే బీసీల సంక్షేమం'

చాగలమర్రి, ఫిబ్రవరి 23: రాష్ట్రంలో టీడీపీతోనే బీసీల సంక్షేమం సాధ్యమని మండల బీసీ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్ అన్నారు. శుక్రవారం చాగలమర్రి బీసీ సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు అధికారంలోకి వస్తేనే ప్రజలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో దౌర్జన్యాలు, అక్రమ కేసులు, వేధింపులు తప్ప ఎలాంటి అభివృద్ధి లేదని ఆరోపించారు. మీడియా స్వేచ్ఛను హరించడం అనైతికమైన చర్య అన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు రామతీర్థం, సుబ్బరాయుడు, చిన్నికృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

'ప్రజలకు మెరుగైన వైద్య సేవలు'

రుద్రవరం, ఫిబ్రవరి 23: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించనున్నట్లు వైద్యాధికారి శివమోహన్ తెలిపారు. శుక్రవారం రుద్రవరంలో ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహించారు. వైద్యపరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

సంజామల, ఫిబ్రవరి 23: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు సంజామల ఎస్ఐ రమేశ్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. పేరుసోములకు చెందిన దూదేకుల పెద్ద దస్తగిరి సంజామల నుంచి 30 క్వార్టర్ బాటిళ్లు తీసుకు వెళ్తుండగా సంజామల గంగమ్మ ఆలయం వద్ద తనిఖీ చేసి మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రేపు మంగపల్లెలో వైద్యశిబిరం

సంజామల, ఫిబ్రవరి 23: మండలంలోని మంగపల్లెలోని పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ప్రజావైద్యశాలలో ఆదివారం మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు గురురామవేంద్ర బ్యాంక్ కోచింగ్ యజమాని గురురాజా విద్యాసంస్థల అధినేత దస్తగిరిరెడ్డి శుక్రవారం తెలిపారు. గుండెజబ్బులు, బీపీ, షుగర్, ఊపిరితిత్తుల వ్యాధులు, ఎముకలు, కీళ్లవ్యాధులు, కన్ను, చెవి, ముక్కు గొంతు వ్యాధులు, చర్మం, దంత వ్యాధులు, స్త్రీవ్యాధులకు ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

పోలియో చుక్కలు వేయించాలి'

చాగలమర్రి, ఫిబ్రవరి 23: మండలంలోని ఐదేళ్లలోపు చిన్నారులకు మార్చి 3న తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని వైద్యులు ఇమ్రాన్, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి సూచించారు. శుక్రవారం చాగలమర్రి ప్రభుత్వ వైద్యశాలలో వారు మాట్లాడుతూ 4,500 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు 32 బూత్‌లు, 64 టీమ్‌లు, 134 మంది సిబ్బందిని నియమించామని చెప్పారు. పోలియో నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'పోలింగ్ కేంద్రాల్లో వసతులపై దృష్టి పెట్టాలి'

చాగలమర్రి, ఫిబ్రవరి 23: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోలింగ్ కేంద్రాల్లో వసతులపై ఎలక్టోరల్ అధికారులు దృష్టి పెట్టాలని తహసీల్దార్ రమణమ్మ సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మండల పరిధిలో 52 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఆ కేంద్రాల్లో మౌళిక వసతులు పరిశీలించి ఓట్ల సమయానికి అవసరమైన వసతులు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ విజయ్‌కుమార్, వీఆర్వోలు ఉన్నారు.

నేడు కాశీ విశ్వేశ్వర స్వామి కల్యాణం

బేతంచెర్ల, ఫిబ్రవరి 23: మండలంలోని రహిమాన్‌పురం గ్రామంలో మహా శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 24న కాశీ విశాలాక్షి విశ్వేశ్వర స్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకుడు బద్దల చిన్న ముద్దు స్వామి శుక్రవారం తెలిపారు. విశ్వేశ్వరస్వామి వారికి రుద్రాభిషేకం, బిల్వార్చన, తర్వాత కాశీ విశాలాక్షి, విశ్వేశ్వరస్వామి వారి కల్యాణం జరుగుతుందన్నారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాల ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా షానేషా వలి ఉరుసు

శిరివెళ్ల, ఫిబ్రవరి 23: శిరివెళ్లలో హజరత్ సయ్యద్ షానేషావలి ఉరుసును శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శిరివెళ్ల, చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు దర్గాలో ఫాతేహాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా నిర్వాహకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. ఎస్ఐ సురేష్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

వాసవీ మాతకు పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

చాగలమర్రి, ఫిబ్రవరి 23: చాగలమర్రి గ్రామంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో మాఘపౌర్ణమి సందర్భంగా శుక్రవారం మహిళలు వాసవీమాతకు విశేష పూజలు చేశారు. వేద పండితులు క్షీరాభిషేకం, పుష్పాభిషేకం చేశారు. మహిళలు 108 దీపాలు వెలిగించి ఉత్సవం చేశారు. వెండి రథంలో అమ్మవారిని కొలువుదీర్చి ఉత్సవం చేశారు. ఆలయ అధ్యక్షుడు లక్ష్మణబాబు, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

నేడు పుట్టా పెద్దమ్మ బోనాలు

బేతంచెర్ల, ఫిబ్రవరి 23: బేతంచెర్ల-బనగానపల్లె రహదారిలోని గంగమ్మ గుడి సమీపంలో వెలసిన పుట్టా పెద్దమ్మకు ప్రముఖ పారిశ్రామికవేత్త బీఎస్ సంజీవరెడ్డి ఆధ్వర్యంలో బోనాల జాతర శనివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకుడు రామకృష్ణ శుక్రవారం తెలిపారు. పట్టణంలోని పాత గురజాల మార్కెట్ వద్ద ఉదయం 5.15 గంటలకు కూరగాయల మార్కెట్ నుంచి బోయపేట కొత్తబస్టాండు, పాతబస్టాండు, హనుమాన్ నగర్, సంజీవనగర్ మీదుగా బోనాల ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.



సమస్యలు పరిష్కరించని పాలకులు

మాజీ మంత్రి భూమా అఖిలప్రియ



వృద్ధురాలితో మాట్లాడుతున్న భూమా అఖిలప్రియ

నంద్యాల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను పాలకులు పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ ఆరోపించారు. ఆళ్లగడ్డ పట్టణంలోని పాలసాగరం రోడ్డు, కర్ణమయ్య వీధులలో శుక్రవారం ఆమె బాబు షూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టో గురించి వివరించారు. ఈ సందర్భంగా ఈ వీధులలో ప్రధానంగా మంచి నీటి సమస్య ఉందని ప్రజలు ఆమె దృష్టికి తెచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పట్టణంలో ప్రజలు మంచి నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యను శనివారంలోగా పరిష్కరించకపోతే సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరాహారదీక్ష చేస్తామని హెచ్చరించారు. ప్రజలకు నిత్యం అవసరమయ్యే మంచి నీటి సమస్యల పట్ల పాలకులు, అధికారులు నిర్లక్ష్యం చేయడం తగదని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు భార్గవ్‌రామ్‌నాయుడు, మాజీ జడ్పీటీసీ చాంద్‌బాషా, కౌన్సిలర్ హుసేన్‌బాషా, మహిళా కార్యకర్తలు అట్ల శ్రీదేవి, నూర్జహన్, తదితరులు పాల్గొన్నారు.

సైనికుల్లా పనిచేయాలి: వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని మాజీ మంత్రి అఖిలప్రియ సూచించారు. ఇటీవల టీడీపీలో చేరిన గంగుల ముఖ్య అనుచరుడు వాసు (సి.శ్రీనివాసరెడ్డి) పడకండ్ల, నాగిరెడ్డిపల్లె గ్రామాల ప్రజలతో మాజీ మంత్రి అఖిలప్రియను ఆమె స్వగృహంలో శుక్రవారం కలిశారు. ఆమె మాట్లాడుతూ వచ్చే ఎన్నికలు రాక్షసపాలనకు, స్వచ్ఛపాలనకు మధ్య జరుగుతున్న యుద్ధమని అన్నారు. ఈ యుద్ధంలో అలుపెరుగని సైనికుల్లా పోరాటం చేసి రాక్షస పాలనకు అంతం పలకాలని పిలుపునిచ్చారు. నాయకులు భార్గవ్‌రామ్‌నాయుడు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైతులపై దాడి అమానుషం

» సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు



రాస్తారోకో నిర్వహిస్తున్న రైతు సంఘం, ఏఐటీయూసీ నాయకులు

డోన్(రూరల్), ఫిబ్రవరి 23: ఢిల్లీలో తమ హక్కుల సాధన కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రైతులపై జరిగిన దాడి అమానుషమని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు అన్నారు. రైతులపై జరిగిన దాడికి నిరసనగా డోన్ పట్టణంలోని గుత్తి రోడ్డులో రైతు సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. నల్లబ్యాడ్జీలు ధరించి చేపట్టిన ఈ నిరసన కార్యక్రమంలో రంగనాయుడు దేశంలో ఇది బ్లాక్ డే అని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య, రాధాకృష్ణ, మండల కార్యదర్శి పులిశేఖర్ పాల్గొన్నారు.

● **సీఐటీయూ ఆధ్వర్యంలో:** ఢిల్లీలో రైతులపై జరిగిన దాడికి నిరసనగా సీఐటీయూ ఆధ్వర్యంలో కార్యకర్తలు రాస్తారోకో నిర్వహించారు. పట్టణంలోని బేతంచెర్ల ప్రధాన రోడ్డులో చేపట్టిన రాస్తారోకో కార్యక్రమంలో సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు కోయలకొండ నాగరాజు, నక్కి శ్రీకాంత్, సీఐటీయూ నాయకులు శివరాం, సుబ్బరాయుడు మాటాడుతూ ఢిల్లీలో ఆందోళన చేస్తున్న రైతులపై పోలీసులు దాడి చేయడం అన్యాయమని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం అను బంధ సంఘాల నాయకులు నాగమద్దయ్య, చిన్న రెహిమాన్, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుర్మార్గపు పాలనకు రోజులు దగ్గర పడ్డాయి

టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి



టీడీపీ మేనిఫెస్టో పత్రాలను అందజేస్తున్న సుబ్బారెడ్డి, నాయకులు

ప్యాపిలి, ఫిబ్రవరి 23: వైసీపీ దుర్మార్గ పాలనకు రోజులు దగ్గర పడ్డాయని టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి విమర్శించారు. పట్టణంలోని 8వ వార్డులో శుక్రవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ జగన్ పాలను రాష్ట్రంలో అధికారపార్టీ నాయకులు దుర్మార్గాలు, దోపిడీలు మితిమీరిపోయాయని దుయ్యబట్టారు. ఎక్కడ పడితే అక్కడ భూకబ్జాలకు పాల్పడుతున్నారు. వైసీపీ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ మురళీక్రిష్ణగౌడు, నాయకులు ఆర్ఈ రాఘ వేంద్ర, చిన్నసుంకయ్య, రామ్మోహన్‌యాదవ్, గండికోట పెద్దరామాంజినేయులు, మౌలాలిరెడ్డి, మల్లికార్జున పాల్గొన్నారు.

మహనీయుల త్యాగాలు మరువలేనివి: మంత్రి

డోన్, ఫిబ్రవరి 23: దేశ ప్రజల కోసం ఎంతో మంది మహనీయులు చేసిన త్యాగాలు మరువలేనివని రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని పాతబస్టాండులో నూతనంగా ఏర్పాటు చేసిన గాంధీ కాంస్య విగ్రహాన్ని, కొత్తబస్టాండు ఎదురుగా ఏర్పాటు చేసిన పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం సాయి ఫంక్షన్ హాలులో అవార్డులకు ఎంపికైన వలంటీర్లకు ప్రశంసాపత్రాలను మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ టీఈ చిన్న కేశవయ్యగౌడు, మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు పాల్గొన్నారు.



గాంధీ కాంస్య విగ్రహాన్ని ప్రారంభిస్తున్న బుగ్గన

నాగులవరంలో ఉత్సవ పల్లకి



నాగులవరంలో ఉత్సవమూర్తులు

రుద్రవరం, ఫిబ్రవరి 23: మండలంలోని ఆర్.నాగులవరం గ్రామంలో దస్తగిరిస్వామి దర్గా పక్కనే హంసపాదులపై అహోబిళ లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ పల్లకిని పెట్టారు. శుక్రవారం దర్గా పక్కనే పార్వేట పల్లకీలో కొలువుదీరిన జ్వాలా లక్ష్మీనరసింహస్వామి, ప్రహ్లాద వరదస్వాములకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు. సర్పంచ్ గంధం సావిత్రమ్మ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ గంధం రాఘవరెడ్డి, టీడీపీ నాయకులు రెక్కల మనోహర్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరికి పూజలు: రుద్రవరంలో కొలువుదీరిన కన్యకా పరమేశ్వరికి శుక్రవారం పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

'పోస్టల్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి'





చాకరాజువేములలో ర్యాలీ చేస్తున్న పోస్టల్ సిబ్బంది, ఆళ్లగడ్డలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోస్టల్ ఇన్‌స్పెక్టర్

దొర్నిపాడు, ఫిబ్రవరి 23: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల కోసం పోస్టల్ శాఖ అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఎ.చంద్రమౌళీశ్వరరెడ్డి సూచించారు. మండలంలోని చాకరాజువేముల గ్రామంలో శుక్రవారం పోస్టల్ పథకాలపై పోస్టల్ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పోస్టల్ శాఖ అమలు చేస్తున్న పథకాలను మెయిల్ ఓవర్సీర్ భాస్కరరావు వివరించారు.

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ పట్టణంలోని పోస్టాఫీసు ద్వారా ప్రజలకు అందే సేవలపై విద్యార్థులకు పోస్టల్ ఇన్‌స్పెక్టర్ చంద్రమౌళీశ్వరరెడ్డి అవగాహన కల్పించారు. పట్టణంలోని భారతీ విద్యామందిరం విద్యార్థులు శుక్రవారం పోస్టాఫీసుకు రావడంతో వారికి అవగాహన కల్పించారు. ఉపాధ్యాయినులు నిర్మల, నవ్యశ్రీ, పోస్టుమాస్టర్ రవిచంద్రారెడ్డి, మెయిల్ ఓవర్సీర్ భాస్కరరావు, పీఏ సుబ్బరాయుడు. వైష్ణవి పాల్గొన్నారు.

చాగలమర్రి: మండలంలోని పెద్దవంగలి గ్రామంలో శుక్రవారం పోస్టల్ ఇన్‌స్పెక్టర్ మౌళీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో తపాలా ఉద్యోగులు, సిబ్బంది, ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు తపాలా జీవిత భీమా, టైమ్ డిపాజిట్, ఆర్‌డీ, సుకన్య సంవృద్ధి యోజన, ఆన్‌లైన్ నమోదు గురించి ప్రజలకు వివరించారు.

నీటి కోసం ప్రజల ఇక్కట్లు



కొత్తపల్లె ఎస్సీ కాలనీలో నీటి కోసం నిరీక్షిస్తున్న ప్రజలు

చాగలమర్రి, ఫిబ్రవరి 23: మండలంలోని డి.కొత్తపల్లె గ్రామంలో మంచి నీటి కోసం కాలనీ వాసులు అవస్థలు పడుతున్నారు. కొళాయిల ద్వారా నీరు సరఫరా కాకపోవడంతో నిరీక్షిస్తున్నారు. కాలనీలో నీరు రాకపోవడంతో పనులు వదులుకొని పొలాల బోర్ల వద్దకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సి వస్తోందని కాలనీ వాసులు చెబుతున్నారు. కాలనీలో ఏర్పాటు చేసిన బోరు నీరుపయోగంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. విద్యుత్ సరఫరా ఉన్నప్పుడు మాత్రమే పొలాల బోర్ల వద్దకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సి వస్తోందని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీరుపయోగంగా ఉన్న బోరు పని చేసేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

హెచ్‌ఐవీ నివారణపై కళాజాతా



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళా జాతా బృందం

సంజామల, ఫిబ్రవరి 23: హెచ్‌ఐవీ నివారణపై సంద్యాల కళాజాతా బృందం శుక్రవారం ముదిగేడు గ్రామంలో సర్పంచ్ అరుణమ్మ ఆధ్వర్యం లో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నాటక ప్రదర్శ నలతో ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యాధి వ్యాపించకుండా తీసుకో వాల్సిన జాగ్రత్తలు, వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చూపరాదంటూ వీధి నాటకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కరు వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

నేడు విగ్రహాల ప్రతిష్ఠ



ముస్తాబైన నూతన ఆలయం

బేతంచెర్ల, ఫిబ్రవరి 23: మండలంలోని సంకలాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీరామ మందిరంలో మాఘశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని సీతారామ లక్ష్మణ సహిత హనుమత్ విగ్రహాల ప్రతిష్ఠ, దీప ధ్వజ స్తంభ, విమాన కలశ ప్రతిష్ఠ కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు గ్రామ ప్రజలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పుష్పాలు, విద్యుద్దీపాలతో ముస్తాబు చేశారు.

పోలియో రహిత రాష్ట్రంగా మార్చాలి



మాట్లాడుతున్న డాక్టర్ శివశంకరుడు

బనగానపల్లె, ఫిబ్రవరి 23: ఏపీని పోలియో రహిత రాష్ట్రంగా మార్చడానికి ప్రతి ఒక్కరూ కలసికట్టుగా పనిచేయాలని టంగుటూరు వైద్య అధికారి డాక్టర్ శివశంకరుడు శుక్రవారం కోరారు. బనగానపల్లె ఎంపీడీవో కార్యాలయంలో ఏఎన్ఎంలు, ఆశా, అంగన్‌వాడీ వర్కర్లకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 0 నుంచి 5సంవత్సరాలలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ప్రతి ఇంటిని సందర్శించి 5 ఏళ్లలోపు పిల్లలను గుర్తించాలన్నారు. డాక్టర్ సోహెల్‌బాబు, సిబ్బంది వెంకటేశ్వర్లు, ఉమామహేశ్వరమ్మ, అంగన్ వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ కోసం ఉద్యమం



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

డోన్(రూరల్), ఫిబ్రవరి 23: ఎస్సీ వర్గీకరణ కోసం ఉద్యమాలు చేపడుతామని కర్నూలు ఉమ్మడి జిల్లా మహాజన సోషలిస్టు పార్టీ కన్వీనర్ గుండాల ఈశ్వరయ్య మాదిగ అన్నారు. ఈ నెల 28న కర్నూలులో జరిగే ఉమ్మడి జిల్లా మహాజన సోషలిస్టు పార్టీ సమావేశానికి మందకృష్ణ మాదిగ హాజరవుతున్నారని తెలిపారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లా సమావేశ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎద్దుపెంట పులికేశవయ్య, నాయకులు రామాంజనేయులు, చిన్నరాముడు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరీ మాత పల్లకి సేవ

బనగానపల్లె,, ఫిబ్రవరి 23: మండలంలోని నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో శుక్రవారం పల్లకి సేవ ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో రామానుజన్, పూజారుల ఆధ్వర్యంలో అమ్మవారిని పల్లకిలో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.



పల్లకి సేవలో చౌడేశ్వరీమాత

ఫోర్‌లైన్ క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

చాగలమర్రి, ఫిబ్రవరి 23: చాగలమర్రి గ్రామంలోని గుంతపాలెం వీధిలో ఏర్పాటు చేసిన ఫోర్‌లైన్ క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం టీడీపీ మైనార్టీ నాయకుడు కొలిమి హుసేన్‌వలి, ఎంఎస్ సమూద్దీన్ ప్రారంభించారు. ఈ పోటీల్లో 24 జట్లు పాల్గొంటాయని నిర్వాహకులు సర్ఫరాజు, హుసేన్‌వలి తెలిపారు. విజేతలకు మొదటి నాలుగు బహుమతులు వరు సగా రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.7 వేలు, రూ.4 వేలు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పీడీ దాదాపీర్, టీడీపీ నాయకులు అజీముద్దీన్, కొలిమి మహ బూబ్ బాషా, కొలిమి సున్ని, కొలిమి షబ్బీర్, అస్రఫ్, నాగూర్‌వలి, ఈర్షాద్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో దుర్మార్గపు పాలన

డోన్(రూరల్), ఫిబ్రవరి 23: రాష్ట్రంలో దుర్మార్గమైన పాలన నడుస్తున్నదని జనసేన డోన్ నియోజకవర్గ నాయకులు ఆలా మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం జనసేన పార్టీ కార్యాలయంలో ప్యాపిలి మండలం, ఏనుగుమర్రికి చెందిన హరీఫ్, మీసాల బాషా, డోన్ పట్టణానికి చెందిన వసంత్, ప్రదీప్ కుమార్ అనే యువకులు జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆలా మోహన్ రెడ్డి మాట్లాడుతూ టీడీపీ, జనసేన కూటమితో ఏర్పడే ప్రభుత్వంలో ప్రజలకు అందించే సంక్షేమ కార్యక్రమాల గురించి జనసైనికులు విస్తృత ప్రచారం చేయాలని కోరారు.

ఘనంగా రోటరీ ఇంటర్నేషనల్ డే

డోన్(రూరల్), ఫిబ్రవరి 23: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రోటరీ ఇంటర్నేషనల్ డేను ఘనంగా నిర్వహించారు. రోటరీ అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మీరెడ్డి మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డిగ్రీ కాలేజీ విద్యార్థులకు రూ.5వేలు విలువ చేసే 50 స్టీల్ ప్లేట్లు, భోజన వసతిని కల్పించారు. గంగిరెడ్డి ఆర్థిక సాయంతో ఈ సాయాన్ని అందజేశారు. అనంతరం రోటరీ క్లబ్ సభ్యుల సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భారతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ఉంటా: భూమా కిశోర్



మాట్లాడుతున్న భూమా కిశోర్‌రెడ్డి

నంద్యాల, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతోపాటు అండగా ఉంటానని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ భూమా కిశోర్‌రెడ్డి అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలో శుక్రవారం ప్రజా శంఖారావం కార్యక్రమాన్ని పాతబస్టాండు నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో అయన మాట్లాడుతూ ఆళ్లగడ్డ పట్టణంలో పలువురు నాయకులు ప్రజల ఆస్తులను దొంగ డాక్యుమెంట్లతో కబ్జా చేస్తున్నారని, దీంతో ప్రజల ఆస్తులకు భద్రత లేకుండా పోయిందని ఆరోపించారు. భవిష్యత్తులో ప్రజల ఆస్తులకు భద్రత కల్పిం చేందుకు కబ్జాదారులపై ఉక్కు పాదం మోపుతానన్నారు. ప్రజా శంఖారావం పట్టణంలోని ఆహోబిలం రోడ్డుతో పాటు సత్రం వీధిలో ముగించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.